ఎన్నాళ్లకెన్నాళ్లకు

నెరవేరనున్న దశాబ్దాల కల

ఏలూరులో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులకు శ్రీకారం 6

ముగ్గురు మోటారు సైకిళ్ల దొంగలు అరెస్టు 7

జంట కోసమేనా ?

ఎక్కడో అభయారణ్యంలోని చిరుత పులి పదే పదే ఊళ్ళల్లోకి వస్తుంది. ఒకటా.. రెండా ఏకంగా వందల కిలోమీటర్ల మేర కాలినడకన ప్రయాణి స్తోంది. అక్కడక్కడ పశువులు, మేకలపై దండ యాత్ర చేస్తోంది. కేవలం నీరు.. ఆహారం కోసమే వెంపర్లాడుతూ మైదాన ప్రాంతాల వైపు వస్తుం దనుకుంటున్నారు. కాని తాజాగా ఆడపులి జంట కోసమే ఈ అన్వేషణే అంటూ కొత్తగా విశ్లేషిస్తు న్నారు. ఆ కోణం వైపు అధికారులు దృష్టిపెట్టారు.

- పదేపదే అడవి వీడి జనవాసాల్లోకి..
- ఇప్పటివరకు ఊళ్ళల్లోకి వచ్చింది మగ చిరుతే..
- వందల కిలోమీటర్ల నడక..



(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

ఎనిమిది నెలల క్రితం నల్లజర్ల పరిసర ప్రాంతాల్లో గ్రామాల్లోని పంట చేలల్లో చిరుత అడుగు జాడలు దర్శనమిచ్చాయి. దట్టమైన అటవీ మార్గం ఉన్న కుక్కునూరు మీదుగా 170 కిలోమీటర్లకుపైగా ప్రయాణించి నల్లజర్ల వైపు సాగిందంటూ విశ్లేషిస్తున్నారు. తిరిగి అదే పులి కొద్దిరోజుల వ్యవధిలోనే గోపాలపురం మండలం లోని కొన్ని గ్రామాలు, తాళ్ళపూడి మీదుగా పోల వరం అటవీ ప్రాంతంలోకి చేరినట్టు అప్పట్లోనే అధికారులు ధ్రువీకరించారు. విశేషం ఏమిటంటే అప్పట్లో సంచరించింది మగ పులేనని దాని అడుగు జాడలను బట్టి నిర్ధారించారు. ఎనిమిది నెలల తర్వాత ఇప్పుడు ద్వారకా తిరుమల, భీమ డోలు, తాజాగా పెదవేగి మండలంలో చిరుత పులి అడుగు జాడలు ప్రత్యక్షమయ్యాయి.

ఎందుకిలా వస్తోంది ?

ఇన్నాళ్ళు అడవిలో నీరు, ఆహారం సమృద్ధిగా లేకనే చిరుతపులి ఊళ్ళవైపు మళ్ళుతుందని అం దరూ అనుకున్నారు. కాని తాజాగా పులి సంచా రం వెనుక ఇంకో మర్మం ఉందని భావిస్తున్నా రు. ప్రత్యేక సీజన్‌లో పులికి క్రాసింగ్‌కు అను వుగా ఉంటుందని, దీనికోసమే జంట కోసం అన్వేషణలో భాగంగానే అటవీ ప్రాంతాన్ని వీడి మైదాన ప్రాంతాల వైపు వస్తోందని, ఒకవేళ ఇది ఫలించకపోతే తిరిగి అభయారణ్యంలోకి వెనక్కి వెళ్తుందని భావిస్తున్నారు. నల్లజర్ల నుంచి జగ న్నాథపురం వరకు సంచరించింది మగ చిరుత పులేనని ఇప్పటికే నిర్ధారణకు వచ్చారు. గతంలో నల్లజర్ల మండలంలో కలకలం సృష్టించిన చిరుత కేవలం కొద్ది రోజుల్లోనే తిరిగి పోలవరం అటవీ ప్రాంతంవైపు వెళ్ళడాన్ని ఇప్పుడు గుర్తు చేస్తున్నారు. తాజాగా ఇప్పటికే చిరుత పులి సం చారం కనిపించిన ప్రాంతాల్లో ట్రాప్ కెమెరాలు, పటిష్ట బోనులను ఏర్పాటు చేశారు. కాని ఇప్పటివరకు ఎక్కడా చిరుత బోనులో పడలేదు. కనీసం ఆ దిశగా సమీపానికి కూడా చేరలేదు. అంటే ఆహారం కోసమే ఈ ప్రాంతం వైపు వచ్చి ఉంటే బోను ట్రాప్‌లకు చిక్కి ఉండేది. కాని అలా కాకుండా పగలు సాధ్యమైనంత మేర ఎవ రి కంట పడకుండా నడక సాగించడం వెనుక ఇదే కారణమని నిర్ధారణకు వచ్చారు. అటవీ అధికారులు ఇదే విషయాన్ని బహిరంగంగా ప్రకటించకపోయినా చిరుత రాక వెనుక అసలు రహస్యం ఇదేనేమోనని భావిస్తున్నారు.



ఎం.నాగులపల్లి వద్ద బోనును ఏర్పాటు చేస్తున్న అధికారులు

చిరుత కోసం జల్లెడ

- తాజాగా పెదవేగి మండలం జగన్నాథపురంలో పాదముద్రలు

ద్వారకా తిరుమల/పెదవేగి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చిరుత సంచారం అటు అధికారులకు, ఇటు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. రైతులైతే తమ పొలాలకు వెళ్లాలంటేనే హడలెత్తిపోతున్నారు. ద్వారకా తిరుమల మండలం ద్వారకానగర్‌లో బుధవారం సంచరించినట్టు గుర్తించగా తాజాగా గురువారం ఉదయం పెదవేగి మండలం జగ న్నాథ పురంలోను చిరుత సంచారాన్ని గుర్తిం చడంతో జిల్లా వాసులు ఆందోళన చెందుతున్నా రు. జిల్లాలో సంచరిస్తున్న చిరుత ఒకటా.. లేక రెండా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. అటవీ అధికారులు తేల్చాల్సి ఉంది. ద్వారకా తిరుమల మండలం ఎం.నాగులపల్లి పరిధిలో సంచరిం చిన చిరుత ఇటీవల రాజమండ్రి దివాన్ చెరువు వద్ద కన్పించిన చిరుత ఒక్కటేనని అట వీ అధికారులు నిర్ధారణకు వచ్చారు. ద్వారకా నగర్ వద్దను న్న శ్రీకార్తికేయ ప్లైయాష్ బ్రిక్స్ సమీ పంలోని ఓ పాడుబడ్డ షెడ్డును చిరుత ఆవా సంగా చేసుకుందని అధికారులు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో 20 వరకు ట్రాప్, రెండు లైవ్ కెమె రాలను, మూడు బోన్లను అమర్చారు. బోన్లలో పందిమాంసాన్ని ఉంచినా ముట్టుకోవ డం లేదు. ఇదిలా ఉంటే తాజాగా గురువారం పెదవేగి మండలం జగన్నాథపురంలో చిరుత సంచారాన్ని గుర్తించారు. ఉదయాన్నే పొలాలకు వెళ్తున్న రైతులు చిరుత పాదముద్రలను చూసి పోలీస్, అటవీ శాఖాధికారులకు సమాచారం అందించా రు. పెదవేగి సీఐ కె.వెంకటేశ్వరరావు, ఎస్ఐ కె.రామకృష్ణ, అటవీశాఖ ఏలూరు రేంజ్ ఆఫీసర్ ఎస్‌వీకే.కుమార్ అక్కడకు చేరుకుని పాద ముద్రలను పరిశీలించి చిరుతగా నిర్ధారిం చారు. చిరుత సంచరించినట్టు గుర్తించిన ప్రాంతాలతో పాటు చుట్టుపక్కల పది ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశామని ఏలూరు రేంజ్ అటవీ శాఖాధికారి కేవీఎస్.కుమార్ తెలిపారు. రాత్రి పూట గస్తీ ఏర్పాటు చేశామని, రైతులు రాత్రుళ్లు పొలాలకు వెళ్ళొద్దని, పగటిపూట కూడా ఒంటరిగా వెళ్లవద్దని, రాత్రి సమయంలో ఇంటి దగ్గర, పశువుల పాకల దగ్గర లైట్లు వేసి ఉంచాలన్నారు.



జగన్నాథపురం వద్ద ట్రాప్ కెమెరాను ఏర్పాటు చేస్తున్న అటవీశాఖాధికారులు

బీసీ వసతి గృహాల్లో.. డిజిటల్ పాఠాలు!



జిల్లాలో రెండు బాలికలు, మూడు బాలుర వసతి గృహాల ఎంపిక

ఏలూరు రూరల్, అక్టోబరు 24 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలోని బీసీ వసతి గృహాల్లో ఇకపై డిజిటల్ తరగతులు నిర్వహించనున్నారు. తొలివిడతగా ఐదు వసతి గృహాల్లో బోధనకు సంబంధించి ఏర్పాట్లను సిద్ధం చేశారు. ఇప్పటికే బీసీ వెల్ఫేర్ అధికారులు నివేదికలు పంపారు. నవంబరులో ఎంపికలు పూర్తిచేసి బాలల దినోత్సవం రోజున విద్యార్థులకు డిజిటల్ పాఠాలు అందుబాటులోకి తీసుకురానున్నారు. జిల్లాలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 14 బాలుర, ఐదు బాలికల వసతి గృహాలు ఉండగా దాదాపు నాలుగు వేల మందికి పైగా విద్యాభ్యాసం చేస్తున్నారు. ఆయా విద్యార్థులకు గణితం, ఆంగ్లం, హిందీ, సైన్స్ తదితర సబ్జెక్టుల్లో మెరుగైన బోధన అందించడమే లక్ష్యంగా ఈ డిజిటల్ తరగతులు ప్రారంభం కానున్నాయి.

వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యం

వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీ సంక్షేమ హాస్టళ్లు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. విద్యార్థులకు కనీస వసతులు కల్పించడంలో విఫలం అయింది. విద్యార్థులకు ఇవ్వాల్సిన కాస్మోటిక్స్, నెలనెల డైట్ ఛార్జీలు చెల్లింపులో తీవ్ర జాప్యం చేసింది. కొన్ని హాస్టళ్లల్లో వార్డెన్‌లు అప్పులు చేసి విద్యా ర్థుల ఆకలి తీర్చాల్సిన దుస్థితి నెలకొంది. వస తి గృహాల్లో రాత్రిపూట విద్యార్థులను చదివిం చడానికి 2019కి ముం దు ప్రత్యేకంగా ట్యూట ర్లను నియమించారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ట్యూటర్స్ నియామకం అట కెక్కింది. ఈ పరిస్థి తిని చక్కదిద్దేం దుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విద్యలో ఇతర విద్యార్థులతో సమా నంగా మెరుగైన ఫలితాలు సాధించడ మే లక్ష్యంగా ప్రణా ళికలు రూపొందిం చింది. ఈ క్రమంలో బీసీ వసతి గృహాల్లో 10వ తరగతి విద్యా ర్థులు మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యం గా ప్రత్యేకంగా బోధకులను నియమించాలని భావిస్తోంది. పాఠశాల నుంచి వచ్చిన తర్వాత వసతి గృహాల్లో డిజిటల్ తరగతులు ప్రారంభించ నున్నారు. సబ్జెక్టుల వారీగా బోధనతో పాటు సందేహాలు నివృత్తి చేస్తారు. వసతిగృహాల్లో ప్రత్యేకంగా ఒక గదిని కేటాయించి ఇక్కడ ఇన్‌టర్యాక్టీవ్ ప్యానల్ బోర్డు ఏర్పాటు చేస్తారు. బోధించే ట్యూటర్‌కు గౌరవ వేతనంగా రూ.1500 నుంచి రూ.2వేలు ఇచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. తొలుత ఏలూరు, నూజివీడు బాలికల వసతి గృహంతో పాటు జంగారెడ్డిగూడెం, ముదినేపల్లి, కైకలూరు, బాలుర వసతి గృహాల్లో డిజిటల్ క్లాసుల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్టు బీసీ సంక్షేమశాఖ అధికారిణి రాధారాణి తెలిపారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే ఏర్పాట్లు చేయను న్నట్టు ఆమె తెలిపారు. విద్యా బోధనకు మోని టర్, ఎలక్ట్రికల్ పరికరాలకు సంబంధించి ఐదు వసతి గృహాలకు సుమారు రూ.3 లక్షలు ఖర్చ వుతుందని అంచనా వేసినట్టు తెలిపారు. పా ఠ్యాంశాలు బోధించేందుకు నలుగురు ట్యూట ర్లను నియమించే అవకాశం ఉందన్నారు. టెన్త్ విద్యార్థులకు మెరుగైన బోధనతో పాటు ఇతర తర గతుల విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలపై డిజిటల్ క్లాస్‌రూమ్‌లో అవగాహన కల్పించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

నా బీసీలంటూ.. జగన్ కపట ప్రేమ

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- చొదిమెళ్ళ ఎంజేపీ గురుకుల పాఠశాల తనిఖీ

ఏలూరు టూటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నా బీసీలంటూ కపటప్రేమను చూపించిన మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి బీసీలను దారుణంగా మోసం చేశారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవితా ఆగ్రహం వ్యక్తం చేశారు. చొదిమెళ్ళ ఎంజేపీ గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే బడేటి చంటితో కలిసి మంత్రి సవిత గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలతో పాటు హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులను వసతి, భోజన సౌకర్యాలు ఎలా ఉన్నా యని ఆరా తీశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ బీసీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కూట మి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంద న్నారు. గురుకుల పాఠశాలల అభివృద్ధికి ముఖ్య మంత్రి చంద్రబాబు రూ.20 కోట్లు కేటా యించారన్నారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ చొదిమెళ్ళలో 10 ఎకరాల స్థలాన్ని సేకరించి గురుకుల పాఠశాలకు శాశ్వత భవనం నిర్మిస్తామన్నారు. డీఆర్వో పుష్పమణి, బీసీ వెల్ఫేర్ అధికారి నాగ రాణి, తహసీల్దార్ జీవీ.శేషగిరి, టీడీపీ నేత ఆర్నేపల్లి తిరుపతి ఉన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

ఏలూరు డీఆర్వో బదిలీ

ఏలూరుసిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా డీఆర్వో డి.పుష్పమణిని బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె స్థానంలో డిప్యూటీ కలె క్టర్ వి.విశ్వేశ్వరరావును నియమించారు. పుష్పమణిని తదుపరి పోస్టింగ్ కోసం జీఏ డీకి రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొ న్నారు. నూతన డీఆర్వోగా నియమితులైన విశ్వేశ్వరరావు పోస్టింగ్ కోసం ఎదురు చూ స్తూ ఇక్కడకు బదిలీ అయ్యారు. పశ్చిమ గోదావరి డీఆర్వోగా పనిచేస్తున్న జె.ఉదయ భాస్కరరావును బదిలీపై నెల్లూరు జిల్లా డీఆర్వోగా, ఆయన స్థానంలో ఎం.వెంకటేశ్వ ర్లును జిల్లా డీఆర్వోగా నియమించారు.

జంగారెడ్డిగూడెం ఆర్డీవో బదిలీ

జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె.అద్దయ్యను బదిలీ చేస్తూ ఆయనను జీఏడీకి తదుపరి పోస్టింగ్ కోసం రిపోర్టు చేయాలని ఆ ఉత్త ర్వుల్లో పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెం ఆర్డీ వోగా మంగళగిరి సీసీఎల్ఏలో అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేస్తున్న ఎంవీ రమణను నియమించారు.

డీఈవోగా వెంకటలక్ష్మమ్మ



ఏలూరు అర్బన్, అక్టో బరు 24 (ఆంధ్ర జ్యోతి) : జిల్లా విద్యాశాఖాధి కారిగా ఎం.వెంకట లక్ష్మమ్మను నియమిస్తూ పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్ గురు వారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యాశాఖ డైరెక్టరేట్‌లో డీడీ కేడర్‌లో సాంకేతికంగా ఉంటూ, ప్రస్తుతం అనకాపల్లి జిల్లా డీఎస్ ఈవోగా పనిచేస్తున్న వెంకట లక్ష్మమ్మను రెగ్యులర్ డీఈవోగా ఏలూరు జిల్లాకు బదిలీ పై నియమించారు. ప్రస్తుత డీఈవో అబ్ర హంను డైరెక్టరేట్‌లో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు. కాగా కొత్త డీఈవోగా నియ మితులైన వెంకటలక్ష్మమ్మ జిల్లాల పునర్వి భజనలో భీమవరం కేంద్రంగా పశ్చిమ గోదావరి జిల్లాకు 2022 ఏప్రిల్‌లో తొలి డీఈవోగా నియమితులై, మూడునెలల పాటు పనిచేసి వ్యక్తిగత కారణాలపై డైరెక్ట రేట్‌కు వెళ్ళిపోయారు. తాజాగా జిల్లాకు బదిలీపై వస్తున్న ఆమె డీఈవో బాధ్యతల తో పాటు, సమగ్రశిక్ష ఏపీసీ (ఇన్‌చార్జి)గా వ్యవహరిస్తారు. ఆమె సోమ వారంలోగా విధుల్లో చేరే అవకాశం ఉంది. పశ్చిమ గోదావరి జిల్లా డీఈవోగా ఈ నారాయణ బదిలీపై వస్తున్నారు. ఈయన రాజమహేం ద్రవరంలో డీవైఈవోగా పనిచేస్తున్నారు.

నేటి నుంచి పశుగణన

ఏలూరు టూటౌన్, అక్టోబరు 24 (ఆంధ్ర జ్యోతి): అఖిల భారత పశుగణన కార్యక్ర మం ఈనెల 25వ తేదీ నుంచి జిల్లాలో ప్రారంభిస్తున్నట్టు పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ జి.నెహ్రూబాబు తెలిపారు. దేశంలో పశుగణన ప్రతీ ఐదేళ్లకు ఒకసారి జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమం శుక్రవారం నుంచి ప్రారంభమై 2025 ఫిబ్రవరి 28వ తేదీ వరకు జరుగుతుందన్నారు.

ప్రతి ఫిర్యాదు ఎఫ్ఐఆర్ చేయిస్తున్నాం..

- నేరాల నియంత్రణకు చర్యలు
- 63 శాతం రికవరీ : ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కేసులు దర్యాప్తునకు ప్రత్యేక చర్యలు చేపట్టి నేరస్తులపై ప్రత్యేక నిఘా పెంచి ప్రజల సహకారం, పాతనేరస్తుల సమాచార సేకరణ ద్వారా కేసులను త్వరితగతిన ఛేదించగలుగుతు న్నామని ఎస్పీ కేపీఎస్ కిశోర్ చెప్పారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ గత ఏడా ది జూలై 15 నుంచి అక్టోబరు వరకు, ఈ ఏడాది జూలై 15 నుంచి అక్టోబరు వరకు నేరాల వివరా లను వెల్లడించారు.

- సొత్తుకోసం ఈ ఏడాది హత్య ఒకటి జరుగగా అరెస్టు చేశామన్నారు. దారి దోపిడీ రెండు జరుగగా ఒక కేసులో నిందితులను అరెస్టు చేశామన్నారు. ఇళ్ల దొంగతనాలు పగటి వేళ 17 జరుగగా నాలుగు కేసులను ఛేదించామన్నారు. రాత్రివేళ దొంగతనాలు 51 జరుగగా 22 కేసులు ఛేదించి పాత కేసులు మరో 11 ఛేదించామ న్నారు. గతేడాది 49 మోటారు సైకిళ్ల దొంగతనాలపై ఫిర్యాదు చేయగా 25 మోటారు సైకిళ్ల రికవరీ చేశారన్నారు. ఈఏడాది 112 మోటారు సైకిళ్ళు అపహరణకు గురైనట్లు ఫిర్యాదురాగా 66 మోటారు సైకిళ్ళను రికవరీ చేశామని, పాత కేసులో మరో 72 మోటారు సైకిళ్ళను రికవరీ చేసినట్టు చెప్పారు. చైన్‌స్నాచింగ్ గత ఏడాది ఆరు జరుగగా ఒక కేసును ఛేదించ గలిగామని, ఈ ఏడాది ఏడు కేసులు నమో దు కాగా రెండు కేసులు ఛేదించామని పాత కేసు ఒకటి ఛేదించామన్నారు. 2023లో ఒక కోటి 60 లక్షల 35 వేల 700 రూపాయలు సొత్తు అపహరణకు గురికాగా 54 లక్షల 64 వేల 120 రూపాయలు రికవరీ చేసి 34 శాతంగా రికవరీ ఉందని వెల్లడించారు. 2024లో రెండు కోట్ల 38 లక్షల 89 వేల 88 రూపాయలు సొత్తు అపహరణకు గురి కాగా, కోటి 35 లక్షల ఒక వెయ్యి 767 రూపాయలు రికవరీ చేశామని, పాత కేసు ల్లో మరో 58 లక్షల 12 వేల 125 రూపా యలు రికవరీ చేశామన్నారు. మొత్తం 63 శాతం రికవరీ చేశామని వెల్లడించారు.
- ప్రతి ఫిర్యాదు స్టేషన్‌లో నమోదు జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని ఒక వేళ ఎవరైనా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేయకపోతే వెంటనే వాట్సాప్ నెంబర్ 95503 51100కు సమాచారం ఇవ్వవచ్చని తానే స్వయంగా ఎన్ని ఫిర్యాదులు వచ్చాయో పరి శీలిస్తానని స్పష్టం చేశారు. ప్రతి ఫిర్యాదు ఖచ్చితంగా ఎఫ్ఐఆర్ నమోదు అయ్యేలా చర్యలు తీసుకున్నామ న్నారు. మహిళలకు భద్రత కల్పించడంలో కీలకమైన చర్యలు చేప ట్టామని స్పష్టం చేశారు. పొరుగు రాష్ట్రాలతో కలిసి సమన్వయంతో నేరకార్యకలాపాలను అరి కట్టడానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని ఎస్పీ స్పష్టం చేశా రు. అసాంఘిక కార్య కలాపాల సమాచారం ఉంటే డయల్ 112కు తెలపాలని సూచించా రు. ఏఎస్పీ ఎన్.సూర్యచంద్ర రావు, డీఎస్పీలు డి.శ్రావణ్‌కుమార్, డీఎస్పీ ప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ సీఐ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.





సమావేశంలో పాల్గొన్న ఎంపీ మహేశ్ కుమార్, కలెక్టర్ వెట్రిసెల్వి

కార్పొరేట్ స్థాయికి.. ఏలూరు ప్రభుత్వాస్పత్రి

ఎంపీ పుట్టా మహేశ్ కుమార్

ఏలూరు క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని పూర్తిస్థా యిలో ప్రక్షాళన చేసి పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలందించే దిశగా తీర్చిదిద్దేందు కు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, వైద్య సిబ్బంది అదేస్థాయిలో జవాబుదారీతనం, అంకి తభావంతో వైద్య సేవలందించేలా పనిచేయాల ని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ వైద్యాధికారుల ను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఏలూ రు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం కలెక్టర్ వెట్రిసెల్వి అధ్యక్షతన జరిగిం ది. ఎంపీ మాట్లాడుతూ.. 'ఆస్పత్రిలో వైద్య సి బ్బంది భర్తీ, ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు పై దృష్టి సారించాను. ఇప్పటికే రూ.4 కోట్లతో ఆధునిక వైద్య పరికరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాను. సమస్యలను నా దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటా'.. అన్నా రు. కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రధాన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం ద్వారా ఉత్తమ ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ఆసుపత్రి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా రూపొందించే కార్యక్రమంలో భాగం గా 125 ఆధునిక బెడ్స్ అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ నాగేశ్వరరావు, జిల్లా ఆస్ప త్రి సేవల సమన్వయాధికారి డాక్టర్ బి.పాల్ సతీష్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ సుధాకర్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శశిధర్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో..

పంచాయతీలకు పోటీ

ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన ఇద్దరు సర్పంచ్‌లకు పురస్కారం

ఏలూరుసిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) :కేంద్ర ప్రభుత్వం 2025 జనవరి 26 న ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో దేశ వ్యాప్తంగా ప్రతి జిల్లా నుంచి ఇద్దరు సర్పంచ్‌లను ఎంపిక చేసి వారిని సత్కరించడానికి నిర్ణయించింది. జిల్లాలో ని సర్పంచ్‌లు, పంచాయతీ సిబ్బంది కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కేంద్ర ప్రభుత్వ పథకా లు అమలపై దృష్టి సారించి సంతృప్తి స్థాయిని నవంబరు 30 వతేదీ నాటికి పొందడానికి చర్య లు తీసుకుని ఈ అవార్డు పొందడానికి పోటీ తత్వంతో పనిచేయాలి' అని కలెక్టర్ వెట్రిసెల్వి కోరారు. ఈ విషయమై గురువారం కేంద్ర ప్రభు త్వపు ముఖ్య కార్యదర్శి జిల్లా కలెక్టర్లతో వీడి యో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రతి జిల్లా నుంచి ఇద్దరు సర్పంచ్‌లను ఎంపిక చేసేందుకు మార్గ దర్శకాలు జారీ చేశారు. అనంతరం కలెక్టర్ మా ట్లాడుతూ కేంద్రప్రభుత్వం నిర్ణయించిన 10 కేంద్ర ప్రభుత్వ పథకాలు ఆయా గ్రామ పంచా యతీల్లో నిర్వహించి నవంబరు 30వ తేదీ నాటి కి ఆ పథకాల్లో సంతృప్తి స్థాయిని సాధించిన ఇద్దరు సర్పంచ్‌లను 2025 జనవరి 26 వ తేదీన ఢిల్లీలో నిర్వహించే గణతంత్ర దినోత్సవంలో అవార్డుకు ఎంపిక చేస్తారన్నారు. హర్‌ఘర్ జల యోజన, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (గ్రా మీణ్) మిషన్ ఇంద్ర ధనుష్, జన్ ఆరోగ్య యో జన, ఉజ్వల్ యోజన, ప్రధాన మంత్రి మాతృ వందన యోజన, ప్రధానమంత్రి విశ్వకర్మ యో జన, ప్రధాన మంత్రి ముద్ర యోజన, ప్రధాన మంత్రి పోషణ్ యోజన, రైతులకు , పశువుల, చేపల పెంపకం దారులకు కిసాన్ క్రెడిట్ కార్డు పథకం వంటి కార్యక్రమాల సంతృప్తి స్థాయిలో అమలు ప్రాతిపదికగా తీసుకుంటామన్నారు.

పంటల బీమా లబ్ధిని అందించాలి

కౌలుదారులకు, రైతులకు ఆర్థిక బీమా పెం పొందిస్తూ పంటల బీమా లబ్ధిని కౌలుదారు రై తాంగానికి అందించేందుకు కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల ప్రత్యేక కమి షనర్ రాజశేఖర్ కలెక్టర్లు, వ్యవసాయ ఉ ద్యాన శాఖాధికారులకు సూచనలు చేశారు. అమరా వతి నుంచి 26 జిల్లాల కలెక్టర్లతో వ్యవ సాయ, ఉద్యాన శాఖాధికారులతో వీసీ నిర్వహించారు.



చెరువును పూడ్చి వ్యవసాయం చేస్తున్న దృశ్యం

చెరువును పూడ్చి.. దర్జాగా సాగు!

- ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు
- వైసీపీ నాయకుడిపై రాజవరం గ్రామ రైతు కలెక్టర్‌కు ఫిర్యాదు

ఏలూరు రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కొయ్యలగూడెం మండలం రాజవరంలో నాలుగు ఎకరాల 30 సెంట్లు ప్రభుత్వ వ్యవసాయ చెరువులో ఓ వైసీపీ నాయకుడు దర్జాగా కబ్జా చేసి చెరువును పూడ్చేసి వరి పంట పండిస్తున్నా అధికారు లు పట్టించుకోవడం లేదని, అదే గ్రామా నికి చెందిన రైతు పేట సప్తగిరిబాబు కలె క్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఆర్.ఎస్.నెంబర్ 508, ఎల్‌పీ నెంబర్ 1,596లో నాలుగు ఎకరాల 30 సెంట్లు వ్యవసాయ చెరువు ఉందన్నారు. ఆ చెరువును అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు దాసరి విష్ణుమూర్తి చెరువును పూడ్చి బోరువేసి కరెంటు సర్వీసుతో సార్వా, దాళ్వా వరి పండిస్తున్నాడన్నారు. అది ప్రభుత్వ చెరువు అని తెలిసినా విష్ణు మూర్తి భార్య వైసీపీ ప్రజాప్రతినిధి కావ డంతో గత ప్రభుత్వ హయాంలో రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభు త్వం వచ్చాకా పలుమార్లు ఫిర్యాదులు చేశా నని అయినా అధికారులలో ఎటువంటి స్పందన లేదన్నారు. ఈ నేపథ్యంలో తనపై కక్ష కట్టి తన అనుచరులతో బెదిరింపులకు పాల్పడుతున్నాడని సప్తగిరిబాబు ఆరోపిం చారు. తక్షణం ఆ భూమిని స్వాధీనం చేసుకుని తిరిగి చెరువును తవ్వించాలని, తనకు రక్షణ కల్పించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అమరావతి నిర్మాణానికి రూ.13.50 లక్షల విరాళం

ముదినేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రాజధానిగా అమరావతి నిర్మాణం పూర్తి కావాలని, అభివృద్ధి జరగాలని ఆకాంక్షిస్తూ గతంలోనే టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒక ఎకరం పొలం అమ్మి రూ.25 లక్షల విరాళం, తన బంగారపు గాజుల అమ్మి రూ.లక్ష పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.లక్ష విరాళాన్ని ముదినేపల్లికి చెందిన ప్రైవేట్ వైద్యుడు డాక్టర్ అంబుల మనోజ్ కుమార్తె, వైద్య విద్యార్థిని వైష్ణవి అందించిన విషయం విదితమే. అప్పట్లో ఆమెను అభినందిస్తూ అప్పటి సీఎం చంద్రబాబు ఆమెను అమరావతి బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించారు. 2018లోనే మరో రూ.5 లక్షలు వివిధ అభివృద్ధి పనులకు వారు అందజేశారు. తాజాగా అర ఎకరం పొలం అమ్మి రూ.12.50 లక్షలు, మరికొంత బంగారం అమ్మి రూ.లక్ష మొత్తం 13.50 లక్షలు విరాళంగా నూతన రాష్ట్ర సచివాలయం, హైకోర్టు భవనాల నిర్మాణాలకు మంగళ వారం రాత్రి సీఎం చంద్రబాబును ఆయన నివాసంలో కలసి అందజేసింది. భూములు అమ్మి అమరావతి రాజ ధాని నిర్మాణానికి తన తండ్రి మనోజ్ సహాయంతో వైష్ణవి విరాళం ఇవ్వడం పట్ల సీఎం ఆశ్చర్యం వ్యక్తం చే శారు. వైష్ణవిని, మనోజ్‌ను ప్రత్యేకంగా అభినందించారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు విరాళం అందజేస్తున్న వైష్ణవి, మనోజ్

స్పోర్ట్స్ కాలమ్

ఆటల్లో ఆణిముత్యాలు



శర్వాణికి ప్రథమ బహుమతి, పతకాన్ని అందజేస్తున్న డీఈవో, తదితరులు

జాతీయస్థాయి జూడో టోర్నీకి శర్వాణీ ఎంపిక

ఏలూరు అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యార్థులకు ఈ నెల 21న శ్రీకాళహస్తిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూడో క్రీడా పోటీల టోర్నమెంట్ 40 కేజీల విభాగం ఈవెంట్‌లో ఏలూరు బాలగంగాధర తిలక్ ఓరియంటల్ మున్సిపల్ హైస్కూలు విద్యార్థిని తుమరాడ శర్వాణి స్వర్ణపతకం గెలుచుకుందని స్కూలు హెచ్ఎం షఫ్రక్ తెలిపారు. నవంబరు 14 నుంచి ఒడిశాలో జరు గనున్న జాతీయస్థాయి పోటీలకు ఏపీ తరపున ప్రాతినిధ్యం వహించడానికి అర్హత సాధిం చిందని వివరించారు. శర్వాణిని గురువారం డీఈవో అబ్రహం, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి అలివేలు మంగ అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు కామవరపుకోట విద్యార్థులు

కామవరపుకోట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కామవరపుకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 14 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు వ్యాయామ ఉపాధ్యాయులు తూంపాటి బాబూరావు, గుడిదల శ్యామలాదేవిలు తెలిపారు. ఈనెల 23న ఏలూరు ఇండోర్ స్టేడియం వద్ద జరిగిన పోటీల్లో వీరు ఎంపికయ్యారు. కబడ్డీలో అండర్-14 బాలురు, బాలికలు కె.రాహుల్, కె.కావ్యశ్రీ, టి.మౌనిక, త్రోబాల్ అండర్-14లో వై.సతీష్, బి.దీపిక, కె.కుశ్వంత్, ఎం.రాకేష్, అండర్-14 బాలికల విభాగంలో కె.కావ్యశ్రీ, ఆర్.మహాలక్ష్మి, ఎన్.శ్రీవల్లి, అండర్-17 విభాగంలో ఎం.ప్రవీణ్‌కుమార్, రాజేష్, అండర్-17 బాలికల విభాగంలో జి.నిస్సీ మహిమ కుమారిలు ఎంపికైనట్టు వివరించారు. శిక్షణ ఇచ్చిన పీడీలను హెచ్ఎం పి.గసబాబు, ఉపాధ్యాయులు సత్కరించారు.

కబడ్డీ పోటీలకు నాగబాబు



కొయ్యలగూడెం, అక్టోబరు 24: రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టుకు అండర్ -17 విభాగంలో కొయ్యలగూడెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థి పీ.నాగబాబు ఎంపికయ్యాడు. ఏలూరులో జరిగిన స్కూల్ గేమ్స్‌లో ఎంపికైనట్లు హెచ్ఎం సుజాత తెలిపారు.





ఎంపికైన విద్యార్థులతో ఎంఈవో బుధవాస్..కొప్పాక హైస్కూల్‌లో విద్యార్థులతో హెచ్ఎం, పీడీ

త్రోబాల్ పోటీలకు పెదవేగి మండల విద్యార్థులు

పెదవేగి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు పెదవేగి మండలం రామ శింగవరం, కొప్పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. 23వ తేదీ బుధవారం ఏలూరులో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లా జట్ల ఎంపిక పోటీల్లో 14 ఏళ్ళ విభాగంలో రామశింగవరం హైస్కూల్‌కు చెందిన దిలీప్, కె.రాజశ్రీ, 17 ఏళ్ల విభాగంలో సీహెచ్ దివ్యశ్రీ, పి.వంశీసాయి, పి.లక్ష్మీపావని ఎంపి కయ్యారు. కొప్పాక హైస్కూల్ నుంచి 14 ఏళ్ల విభాగంలో కె.భువ నేశ్వరి, పి.నాగదీప్తి, బాల మణికంఠ, జే.వెంకట్, జే.ధనుష్, 17 ఏళ్ల విభాగంలో పి.గౌరీదేవి, లక్ష్మీశరణ్య, తరుణ్ శ్రీరామ్, ఎస్.అభిషేక్, ఎంపికయ్యారు. ఆయా పాఠశాలల్లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ఎంఈవో బుధవాస్, రామశింగవరం, కొప్పాక హైస్కూల్ హెచ్ఎంలు టీవీ.పద్మావతి, ఆర్.శైలజ, పీడీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.



అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం ప్రసాదరావు, సర్పంచ్ గోపి

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు కైకరం విద్యార్థులు

ఉంగుటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు మండలం కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైనట్టు హెచ్ఎం గుళ్ళ ప్రసాదరావు తెలిపారు. అండర్-17 మూడు కి.మీ పరుగులో ఎం.అంజనేయస్వామి జిల్లా ప్రథమస్థానం, 1500 మీటర్లలో ద్వితీయ స్థానం సాధించాడు. షాట్‌పుట్‌లో అండర్ -17 బాలికల విభాగంలో మేరీ ద్వితీయస్థానం, అండర్-14 బాలుర విభాగంలో ఏ.సుభాష్ ప్రథమ, 200 మీటర్లలో కే.మనోజ్ ప్రథమ, కే.నవీన్ కుమార్ 100 మీటర్ల పరుగులో తృతీయ, దేవకీ ప్రియాంక హైజంప్‌లో ద్వితీయస్థానం పొంది రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. కైకరంలో అండర్-14 అథ్లెటిక్స్ నిర్వహించనున్నట్లు హెచ్ఎం తెలిపారు. పీడీలు పాపాయమ్మ, నాగసుధ, విద్యార్థులను సర్పంచ్ సలగాల గోపి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ అల్లూరి జగదీశ్వరి, తదితరులు అభినందించారు.

29 నుంచి సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడా పోటీలకు ఎంపికలు

ఏలూరు రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రక్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 29 నుంచి 30వ తేదీవరకు ఏలూరు జిల్లాలోని ప్రభుత్వ సివిల్ సర్వీస్ ఉద్యోగులకు వివిధ క్రీడాంశాల్లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 29న ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, ఖోఖో, బెస్ట్ ఫిజిక్, 30న హాకీ, కబడ్డీ, టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, స్విమ్మింగ్, మ్యూజిక్, డ్యాన్స్ పోటీలకు స్త్రీ, పురుషులకు ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులకు నవంబరు 6 నుంచి 9 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన వారు జాతీయస్థాయి సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడా పోటీలకు ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఆయా క్రీడాంశాల్లో పాల్గొనే సివిల్ సర్వీస్ ఉద్యోగులకు సంబంధించిన డిపార్ట్‌మెంట్ ఐడీప్రూఫ్, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, సీఎఫ్ఎంఎస్‌తో ఏఎస్సార్ స్టేడియంలో ఈనెల 28న సాయంత్రం 5 గంటల్లోపు పేర్లు రిజిస్టర్ చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. సమాచారానికి 98663 17326 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

తైక్వాండో పోటీలు ప్రారంభం



కైకలూరు (ముదినేపల్లి), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల విద్యార్థుల తైక్వాండో ఆటల పోటీలను గురువారం కైకలూరులోని ప్రభుత్వ వైవీఎన్నార్ డిగ్రీ కళాశాలలో వైస్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఉదయ ప్రకాశరావు ప్రారం భిం చారు. వివిధ కళాశాలలకు చెందిన 60 మంది పాల్గొన్నారు. విజేతలైన క్రీడాకారులు వచ్చే నెల ఆరు నుంచి అమృతసర్‌లో జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొంటారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ శివనాగరాజు తెలిపారు.

ఇళ్లపై సోలార్ వెలుగులు



ఏలూరులో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్

నెల బిల్లు 138 రూపాయలే

ఏలూరు శనివారపు పేటకు చెందిన సుజాత సూర్యఘర్ పథకంలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకున్నారు. గతంలో నెలవారీ విద్యుత్ బిల్లు రూ. 2 వేల వరకు వచ్చేది. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకున్న తర్వాత రూ.138 బిల్లు వచ్చింది. వచ్చే నెలలో అసలు బిల్లు వచ్చే అవకాశం ఉండదు. ఎందుకంటే మిగులు విద్యుత్ విక్రయించడం ద్వారా విద్యుత్ శాఖ నుంచి సొమ్ములు వస్తాయి. 3 కిలోవాట్ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేశారు. రూ.2 లక్షలు ఖర్చు అయింది. దీనికి బ్యాంక్ లోన్ వచ్చింది. రూ.78 వేలు సబ్సిడీ వచ్చింది. మిగిలిన సొమ్ము ఈఎంఐ ద్వారా చెల్లించవచ్చు. మిగులు విద్యుత్‌కు సంబంధించి విద్యుత్ శాఖ సొమ్ములను బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుందని సుజాత వివరించారు.

సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ప్రోత్సాహం

ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన

ఉమ్మడి పశ్చిమలో 75,860 కనెక్షన్లు ఏర్పాటు లక్ష్యం

ఇళ్లపై రూఫ్ టాప్ ప్యానెళ్ల ఏర్పాటు

నిరంతర సరఫరా..తక్కువ బిల్లులు

అదనపు విద్యుత్‌తో ఆదాయం



ఏలూరుసిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటా విద్యుత్ కాంతులు వెదజల్ల నున్నాయి. సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనకు శ్రీకారం చుట్టింది. ఇంటి పైభాగంలో సోలార్ రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేసుకుని సొంతంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసి వినియోగించు కోవడంతో పాటు అదనపు విద్యుత్‌ను గ్రిడ్‌కు తరలించి విక్రయించుకోవడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చు. నిరంతర విద్యుత్‌తో పాటు అంతరాయాలు, లోఓల్టేజి, బిల్లుల సమస్యలకు చెక్ పెట్టే విధంగా ఈ పథకాన్ని రూపొందించారు. ప్రభుత్వం సబ్సిడీ కూడా అందించటంతో ఈ పథకానికి అనూహ్య స్పందన లభిస్తోందని చెబుతున్నారు.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులు ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రులు, పాఠశాలలు, రైల్వే స్టేషన్లు, రైల్వేగేట్లు, డివైడర్లు, అపార్ట్‌మెంట్లు వద్ద సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుంటున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 75,860 సోలార్ కనెక్షన్లు ఏర్పాటు చేయాలని ఏపీ ఈపీడీసీఎల్ లక్ష్యంగా నిర్ధేశించుకుంది. ఇప్పటికే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 1039 మంది వినియోగ దారులు సోలార్ కనెక్షన్లు కోసం దరఖాస్తు చేసుకోగా ఇప్పటివరకు 425 కనెక్షన్లు పూర్తయ్యాయి.

సామర్థ్యం	ఉత్పత్తయ్యే యూనిట్లు	ప్రస్తుత బిల్లు	వచ్చే బిల్లు (సుమారుగా)	ఏడాదికి ఆదా	ప్రభుత్వ రాయితీ
1 కిలోవాట్	120 యూనిట్లు	రూ.1,000	రూ. 338	రూ.8,000	రూ. 30,000
2 కిలోవాట్లకు	240 యూనిట్లు	రూ.2,000	రూ. 333	రూ.20,000	రూ. 60,000
3 కిలోవాట్స్‌కు	360 యూనిట్లు	రూ.3,000	రూ. 293	రూ.32,400	రూ. 78,000

ప్యానెల్స్..నెట్ మీటర్ ఏర్పాటు ఇలా

విద్యుత్ అధికారుల ఆమోదంతో ఆయా గృహాలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తారు. భవనం పైభాగంలో వంద చదరపు అడుగుల స్థలంలో ప్యానెల్ అమర్చుతారు. ప్రస్తుతం వినియోగించే విద్యుత్ మీటర్ స్థానంలో నెట్ మీటర్ ఏర్పాటు చేసి దీని ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసి వినియోగాన్ని లెక్కిస్తారు. వినియోగాన్ని మించి ఉత్పత్తయిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అను సంధానం చేస్తారు. అదనపు విద్యుత్‌కు విద్యుత్ శాఖ ఆదాయం అందిస్తుంది. సబ్సిడీ, బ్యాంకు రుణంతో పాటు పెట్టుబడి 6, 7 సంవత్సరాల్లో తిరిగి వచ్చే అవకాశాలున్నాయి. ప్యానెల్స్ ఏర్పాటు చేసిన 30 రోజుల్లో వినియోగదారుల ఖాతాల్లో సబ్సిడీ జమ చేస్తారు. 100 చదరపు అడుగుల్లో ఏర్పాటు చేసిన కిలోవాట్ రూఫ్ టాప్ కెపాసిటీ విద్యుత్ ఉత్పత్తికి 3 నుంచి 4 ప్యానెల్స్ ఉపయోగిస్తారు.

దరఖాస్తు ఇలా ?

ఈ పథకం పొందాలంటే గృహ విద్యుత్ వినియోగం 300 యూనిట్లు లోపు ఉండాలి. ఇది గృహ విద్యుత్ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుంది. ఈ పథకం కోసం మొబైల్‌లో సూర్యఘర్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఆన్‌లైన్ దరఖాస్తులో వినియోగ దారుని వివరాలు నమోదు చేయాలి. ఆరు నెలల విద్యుత్ బిల్లులు కాపీలను జతచేసి ఈ పథకానికి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. రిజిస్ట్రేషన్ రుసుం కిలోవాట్ ఆధారంగా చెల్లించాల్సి ఉంటుంది. అనంతరం ట్రాన్స్‌కో అనుమతులు పొందిన తర్వాత వెండర్లను ఎంపిక చేసుకోవాలి. కిలోవాట్స్‌ను బట్టి సబ్సిడీ మంజూరు చేస్తారు. మిగిలిన సొమ్ము మొత్తానికి బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తారు. వినియోగదారులు వాయిదాల పద్ధతిలో రుణం చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకం వల్ల గృహ వినియోగ దారులకు అతి తక్కువ విద్యుత్ బిల్లు వస్తుంది. సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు, విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టోల్‌ఫ్రీ నెంబరు 1912లో సంప్రదించవచ్చు.

ఇప్పటివరకు 1039 మంది రిజిస్ట్రేషన్



ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు కోసం 1039 మంది ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇందులో 425 కనెక్షన్లు ఏర్పాటు చేశారు. భీమవరం విద్యుత్ డివిజన్‌లో 61, ఏలూరు 108 , జంగారెడ్డిగూడెం 17, నరసాపురం 55, నిడదవోలు 90, తాడేపల్లిగూడెం విద్యుత్ డివిజన్‌లో 94 మంది ఇన్‌స్టాల్ చేసుకున్నారు. మిగిలిన దరఖాస్తులకు సంబంధించి సోలార్ కనెక్షన్లు అప్రూవల్ పూర్తయినా గ్రౌండింగ్, ఇన్‌స్టలేషన్ స్టేజ్‌లో ఉన్నాయి. వినియోగదారులు ముందుకు వస్తే జిల్లా వ్యాప్తంగా సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేయటానికి అవకాశం ఏర్పడుతుంది.

- సాల్మన్ రాజు, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ, ఏలూరు



క చిత్రం ప్రమోషన్ విడుదల చేస్తున్న హీరో కిరణ్ అబ్బవరం

భీమవరంలో క చిత్రం ప్రమోషన్

భీమవరం టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : భీమవరంతో ఎంతో అనుబంధం ఉందని, ఇప్పటికి నాలుగుసార్లు భీమవరం వచ్చానని తన మొదటి షార్ట్ ఫిలిం 'ఓ మనసా ఇటు రావే' భీమవరంలోనే చేశామని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. 'క' చిత్రం ప్రమోషన్స్‌లో భాగంగా భీమవరం నాయుడు గారి కుండ బిర్యానీలో కిరణ్ గురువారం సందడి చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్ఆర్ కళ్యాణ మండపం, సంక్రాంతి వేడుకలకు ఈ ప్రాంతానికి వచ్చానని, మీరు చూపించే ఆదరణ ఎప్పటికి మరవలేనన్నారు. ఈనెల 31న చిత్రం విడుదలవుతుందన్నారు.1977 నాటి అంశాల ఆధారంగా ఈ చిత్రాన్ని చేశామని గొప్ప విజయం అందిస్తారని కోరుకుంటు న్నామన్నారు. ఈ చిత్రాన్ని చూసి ఆ టికెట్ రాష్ట్రంలోని నాయుడు గారి కుండ బిర్యానీ 36 బ్రాంచ్‌ల్లో ఎక్కడ చూపించినా రాయి తీపై ఫుడ్ అందిస్తారన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు

నెరవేరనున్న దశాబ్దాల కల

ఏలూరులో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులకు శ్రీకారం



తంగెళ్లమూడిలో మురుగునీటి శుద్ధి కేంద్రం

ఏలూరు టూటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) ::ఏలూరు నగర వాసులకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ దశా బ్దాల కల. ఈ స్వప్నాన్ని కూటమి ప్రభుత్వం త్వరలో నిజం చేయబోతుంది. ఎన్నో ప్రభు త్వాలు వచ్చినా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థకు శ్రీకారం చుట్టలేదు. 2014లో అధి కారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి పూనుకుంది. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకంలో రూ.37.48 కోట్లు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి మంజూరు చేసింది. చింతలపూడి సబ్ బేసిన్ ప్రాంతంలో తంగెళ్ళమూడిలో 50 లక్షల లీటర్ల మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్‌టీపీ) ఏర్పాటుకు పనులు ప్రారం భించారు. ఈ ఆరు డివిజన్లలో ఉత్పన్న మయ్యే సెప్టిక్ ట్యాంకుల్లో ఉన్న వ్యర్థాన్ని శుద్ధి చేసే ప్లాంటు నిర్మాణానికి పనులు ప్రారంభించారు. ఆరు డివిజన్స్‌లోని 21 కిలోమీటర్ల దూరంలో భూమిలో పైపులైన్లు వేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రాబోయే 30 సంవత్సరాల్లో ప్రజల అవసరాలు తీర్చే విధంగా అండర్ గ్రౌడ్ డ్రైనేజీ డిజైన్ చేశారు. ఈ శుద్ధి కేంద్రాన్ని పదేళ్ళ తరువాత పెంచు కునేలాగా డిజైన్ చేశారు. అమృత్ పథకంలో యూజీడీ నిర్మాణానికి 38.48 కోట్లు మంజూరు చేశారు. దీనిలో కేంద్ర ప్రభుత్వం వాట 10.05 కోట్లు రాష్ట్రం వాటా 3.94 కోట్లు, నగరపాలక సంస్థ వాటా 14.18 కోట్లు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వాటా 9.31 కోట్లుగా నిర్ణయిం చారు. 2018 సంవత్సరంలో అనాటి టీడీపీ ప్రభుత్వం పనులు ప్రారంభించింది. ఆయా డివిజన్స్‌లో పైపులైన్ల పనులు ప్రారం భించారు. 1వ డివిజన్ పాత డంపింగ్ యార్డు వద్ద మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణాలు మొదలుపెట్టారు. ఈ పనులు మధ్యలో ఉండగానే ఎన్నికలొచ్చాయి. ఎన్నికల అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులన్నీ ఎక్కడివి అక్కడే ఆగిపోయాయి.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెను వెంటనే యూజీడీ పనులు ప్రారంభించింది. ప్రభుత్వం వచ్చిన 100 రోజుల లోపే డంపింగ్‌యార్డు వద్ద 50 లక్షల లీటర్ల మురుగునీటి శుద్ధి కేంద్రం పనులు పూర్తి చేసింది. ట్రయల్ రన్‌ను ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య ప్రారంభించారు.



వన్‌టౌన్‌లో పనులకు డీపీఆర్

వన్‌టౌన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు రూ.112 కోట్లతో డీపీఆర్ తయారు చేశారు. పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఇంజ నీరింగ్ ఇన్ చీఫ్‌తో టెక్ని కల్ సేంక్షన్ కోసం పంపించారు. త్వరలో అనుమతి వచ్చే అవకాశం ఉంది. అనుమతి లభించిన తరువాత టెండర్ల పనులు ప్రారంభిస్తారు. ఇందులో భాగంగా పోణంగిలో 15 ఎంఎల్‌డీ సామర్థ్యంతో మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేస్తారు. 7వ డివిజన్ నుంచి 17వ డివిజన్ వరకు 38 కిలోమీటర్ల మేర 3 పైపు లైన్లు వేస్తారు. లక్ష్మమ్మకొనేరు, వెంకటాపురంలో రెండు పంపింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తారు. ఈ పంపింగ్ స్టేషన్ వద్దకు వచ్చిన మురుగు నీటిని శుద్ధి చేసి వెంకన్న చెరువుకు పంపి స్తారు. దీనిలో భాగంగా పది కిలోమీటర్లలో ఉన్న పాత పైపులైన్లను మరమ్మతులు, పూడిక తీస్తారు. 1980లో వన్‌టౌన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిం చారు. దానికి సంబంధించిన మురుగు నీటి శుద్ధి కేంద్రం పైపులైన్లు పూడుకు పోయాయి. దీంతో నూతన టెక్నాలజీతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.

ఫొటో ఫోకస్

డేంజరస్

ఈ మలుపుల్లో జర.. జాగ్రత్త



రహదారులపై ప్రమాదకరమైన మలుపులు మృత్యు మార్గాలుగా మారాయి..ఎదురుగా ఎవరొస్తున్నారో తెలియకపోతే యాక్సిడెంట్ అవడం ఖాయం.. ఇలాంటి మలుపుల్లో జనం బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సిన పరిస్థితి. **- పెంటపాడు**

☛ తాడేపల్లిగూడెం నుంచి భీమవరం వెళ్ళే కే.ఎస్ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ రహదారిలో పెంటపాడు దాటిన తరువాత ముదునూరు గ్రామం మధ్యలో రహదారిపై ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. ఈ రహదారికి రెండు పక్కలా దట్టంగా పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో రహదారి మూసుకుపోయి ఎదురు వచ్చే వాహనాలు అసలు కనిపించవు.. దీంతో ఇక్కడ తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయి. హెచ్చరిక బోర్డులు లేవు.. లైట్లు కూడా లేక పోవడంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి.. ఈ మలుపు వద్ద జరిగిన ప్రమాదంలో పలువురు మృతి చెందగా ఎంతో మంది గాయాల పాలయ్యారు.

☛ పెంటపాడు నుంచి కే.పెంటపాడు వెళ్లే రోడ్డులో వెలమసంఘం వద్ద ప్రమాదకర మలుపు ఉంది. ఇక్కడా ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఉండవు. ఈ రహదారికి అనుకుని అన్నీ ఇళ్ళే ఉంటాయి. దీంతో వాహనాలు వచ్చే వేగానికి పిల్లలకు ఎటు వంటి ప్రమాదాలు జరుగుతాయోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే రహదారికి కే.పెంటపాడు సెంటర్ వద్ద భారీ మలుపు ఉంది. ఈ మలుపు దగ్గర ఇప్పటికే అనేక రోడ్డు ప్రమాదాలు జరిగాయి. కానీ నేటికి ఈ మలుపు వద్ద హెచ్చరిక బోర్డులు గానీ, స్పీడ్ బ్రేకర్లు గానీ లేవు..అధికారులు స్పందించి ప్రమాదకర మలుపులు ఉన్న చోట్ల అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



కే.పెంటపాడు సెంటర్ వద్ద ...

తాడేపల్లిగూడెం- భీమవరం వెళ్లే కేఎస్ రహదారిలో ముదునూరు సమీపంలో ప్రమాదకర మలుపులు



వెలమసంఘం భవనం వద్ద కే.పెంటపాడు వెళ్లే రోడ్డులో..

ఆంధ్రజ్యోతి పరిశీలన

ఘాట్‌లు తూట్లు

కార్తీక మాసం సమీపిస్తున్నది. కాని ఉమ్మడి జిల్లాలో పుష్కరఘాట్‌ల పరిస్థితి అధ్వానంగా ఉన్నది. గోదావరి, కాల్వల్లో భక్తులు పుణ్య స్నానాలు చేయడానికి ఏర్పాట్లు చేయలేదు. గతంలో నిర్మించిన పుష్కరఘాట్‌లే దర్శనమిస్తున్నాయి. ఈ ఘాట్‌లపై కొన్ని చోట్ల బురద పేరుకుపోయింది. మరికొన్ని ధ్వంసమయ్యాయి. అనేక రేవుల్లో బారికేట్లు ఏర్పాటు చేయలేదు. పుణ్యస్నానాలు చేసిన తర్వాత భక్తులు నీటిలో కార్తీక దీపాలు వదులుతుంటారు. నీటి లోతు తెలియని భక్తులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉన్నది. రేవుల వద్ద భక్తులు దుస్తులు మార్చుకోవడానికి గదులు ఏర్పాటు చేయలేదు. రేవుల్లో గాజుముక్కలు, నిమజ్జనాల సందర్భంగా బొమ్మల్ని గోదావరిలో కలిపారు. వీటికి సంబంధించిన ఇనుప ఊచలు కూడా తీయాల్సి ఉంది. ఇక చీకటి పడితే రేవుల్లో అంధకారమే. దీని వల్ల భక్తులు తెల్లవారుజామున ఇబ్బందులు పడుతున్నారు. ఘాట్‌ల వద్ద అసౌకర్యాలపై భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఏర్పాట్లు చేయవలసి ఉన్నది.

పోలవరం నుంచి గూటాల వరకూ గతంలో ఇసుక తిన్నెలతో స్నానాల రేవులు ఉండడం వలన ఎలాంటి ప్రమాదాలు లేకుండా నిర్భయంగా భక్తులు కార్తీక మాస పుణ్య స్నానాలు , నిత్య స్నానాలు చేసేవారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం తర్వాత స్పిల్వే నుంచి విడుదలవుతున్న జలాల తాకిడికి గోదావరి నది దిశ మారి పోలవరం నుంచి గూటాల వరకు రేవులు ప్రమాదకరంగా లోతుగా మారిపోయాయి. కృష్ణారావుపేట, బంగారమ్మపేట, పట్టిసీమ, కొత్తపట్టిసీమ, గూటాల రేవులలో మాత్రమే నదిలోకి మెట్లతో కూడిన రేవులు ఉన్నాయి. అయితే బారికేడ్‌లు, వెదురు తడికలు ఏర్పాటు చేయవలసి ఉన్నది. పుణ్య స్నానాలు చేసుకునే ప్రాంతాల్లో విద్యుద్దీపాల ఏర్పాటు, స్నానాల గదులు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. పట్టిసీమ ఫెర్రీ రేవునే పుణ్యస్నానాల కోసం ఎక్కువగా ఆశ్రయిస్తున్నారు. ఇక్కడ నదిలో బారికేడ్‌లు, బట్టలు మార్చుకునే గదులు, రేవులో ఉన్న మరుగుదొడ్లను శుభ్రం చేయించి సిద్ధం చేయాలని భక్తులు కోరుతున్నారు.

- పోలవరం



పట్టిసీమ ఫెర్రీరేవు



ఆటోల వెనుక స్నానాల ఘాట్

గణపవరంలోని వెంకయ్యవయ్యేరు స్నానాల ఘాట్ ఆపరిశుభ్రంగాను చెత్తాచెదారంతోనూ, దుర్గంధంతోనూ కొట్టుమిట్టాడుతున్నాయి. స్నానాల ఘాట్ పరిసర గృహాల వారు ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం కూడా ఈ రేవులోనే పారబోస్తున్నారు. ఈ ఘాట్ వద్ద ఆటోలు, వ్యాన్‌లు నిలుపుదల చేస్తుంటారు. వాహనాల స్టాండ్‌గా మారిపోయింది.

- గణపవరం



బురద ఘాట్‌లు

కోడేరు, కరుగోరుమిల్లి, భీమలాపురంలలో రేవులు ఉన్నాయి. గోదావరి వరదల వల్ల మట్టితో పూడుకుపోయాయి. ప్రధానంగా పెదమల్లం మాచేనమ్మ ఆలయం వద్ద ఉన్న రేవులో పుష్కర సమయంతో పాటు ఆలయానికి వచ్చే భక్తులు నిత్యం రేవులో గోదావరి స్నానాలు చేస్తారు. ఇక్కడ కూడా రేవు పూర్తిగా మట్టితో కప్పబడి ఉంది.

- ఆచంట

అపరిశుభ్రం

నరసాపురం కాలువలో భక్తులు స్నానాలు చేయడానికి సుమారుగా 25 రేవుల వరకూ ఉన్నాయి. రేవులను శుభ్రం చేసే పనులు మునిసిపల్ సిబ్బంది చేపట్టినప్పటికీ ఇంకా అనేక ఘాట్‌ల వద్ద అపరిశుభ్రత నెలకొన్నది. కార్తీక మాసంలో ప్రతి రోజు రేవుల వద్ద బ్లీచింగ్ చల్లవలసి ఉన్నది.

- పాలకొల్లు అర్బన్





తుప్పు పట్టిన షవర్‌బాత్‌లు

వశిష్ఠ గోదావరికి వరదలు తాకడంతో మెట్లపై మట్టి, బురద పేరుకుపోయింది. వలంధర్, కొండాలమ్మ, అమరేశ్వర, లక్ష్మణేశ్వరం రేవుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది. షవర్‌బాత్‌లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. రేవుల్లో ప్రమాద హెచ్చరిక చుట్టూ ఏర్పాటు చేసిన ఫిన్సింగ్ కొట్టుకుపోయింది.

- నరసాపురం

మజ్జిగ జీవామృతంతో అధిక దిగుబడులు



ఆవుపేడతో చేసిన పిడకలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఆచంట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శిక్షణలో భాగంగా సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కోసం వ్యవసాయ అధికారులు ఆచంటలో రైతు చిలుకూరి విశ్వేశ్వరరావు వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. మజ్జిగ జీవామృతం పంచగవ్యాలను వాడుతూ అధిక దిగుబడులు ఎలా సాధిస్తున్నారు అనే విషయాన్ని రైతు వివరించడం జరిగింది. ఐదు సంవత్సరాలుగా రైతు విశ్వేశ్వరరావు పుల్ల మజ్జిగ పై వ్యవసాయాన్ని చేస్తున్నాడు. దీనికి ఎటువంటి ఎరువు గాని పురుగు మందులు గాని వాడకుండానే ఇలా వ్యవసాయం చేస్తున్నాడు. దీంతో శాస్త్రవేత్తలు కూడా రైతు చేస్తున్న విధానాన్ని అభినందించారు. అలాగే ఆవు పిడక (కచ్చిక) బూడిదను ప్రతి రోజూ ఉదయం పళ్ల తోము కుంటే పళ్ల సమస్యలు ఉండవని, ఆవు పేడతో పిడకలు కూడా చేస్తున్నట్లు రైతు విశ్వేశ్వరరావు, సత్యవతి దంపతులు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎండీ కృష్ణాజీ, సినీయర్ సైంటిస్టు వై. సునీత తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక అందించడమే లక్ష్యం



ఇసుక రీచ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పార్థసారథి

ముసునూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక పాలసీకి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. వలసపల్లి, యల్లాపురంల్లో గురువారం ఉచిత ఇసుక రీచ్‌లను ఆయన ప్రారంభించారు. ఇప్పుడున్న రీచ్‌లతోపాటు మరో 108 రీచ్‌లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. దూరాన్ని బట్టి ధర వసూలు చేయాలని, ఇష్టారాజ్యంగా వసూలు చేసేందుకు విలులేదని ఆయన స్పష్టం చేశారు. దీనిపై ట్రాక్టర్ల యాజమానులు సమావేశమై ధరల వివరాలను ఆర్డీవోకు అందజేయాలన్నారు. నూజివీడు ఆర్డీవో వాణి, సర్పంచ్‌లు చలసాని దామోదరరావు, మొక్కపాటి మురళీ కృష్ణ, ఎంపీడీవో జి.రాణి, ఇన్‌చార్జి తహసీల్దార్ పురుషోత్తమశర్మ, టీడీపీ మండల అధ్యక్షులు దేవినేని డలరాం, గ్రామ అధ్యక్షులు మేదరమెట్ల సురేంద్ర, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పశుగణనకు సహకరించండి

దేశ వ్యాప్తంగా 21వ పశుగణన అక్టోబర్ 25 నుంచి 2025, ఫిబ్రవరి 28 వరకు జరుగుతుందని, మంత్రి పార్థసారథి తెలిపారు. పశుగణనకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, బ్రోచర్లు, స్టిక్కర్లు, మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. పశుగణన పూర్తి అయితే ఇంటి ముందు తలుపునకు కుడి ఎగువ మూలలో స్టిక్కర్ అంటిస్తారన్నారు.



ఎం నాగులపల్లి వద్ద బైక్‌పై వెళ్తున్న ఓ జంటకు హెల్మెట్‌లు అందజేస్తున్న ఎస్పీ శివకిషోర్

రోడ్డు ప్రమాద అనర్థాలపై అవగాహన

వాహనదారులకు ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ కౌన్సెలింగ్

ద్వారకాతిరుమల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వాహనదారులు గమ్యానికి చేరడంలో పది నిమిషాలు లేటైనా పర్వాలేదు కానీ... ప్రమాదం జరిగి ప్రాణాలు పోతే ఆ కుటుంబానికి ఎనలేని నష్టం వాటిల్లుతుందని జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ అన్నారు. రహదారి ప్రమాదాల నివారణకు ఎస్పీ ఓ విన్నూత్న కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టారు. ఈక్రమంలో మండలంలోని ఎం నాగులపల్లి అడ్డరోడ్డు వద్ద గతంలో ప్రమాదానికి గురైన బైక్‌ను చూపుతూ రోడ్డుప్రమాదం వల్ల జరిగే అనర్థాలపై ప్రజలకు, వాహనదారులకు అవగాహన కల్పించారు. అలాగే హెల్మెట్ వాడకం వల్ల వాహనదారులకు జరిగే లాభాలను వివరించారు. ఇదే సమయంలో ద్విచక్ర వాహనంపై కుటుంబంతో హెల్మెట్ లేకుండా వెళ్తున్న వ్యక్తిని ఆపి అతనికి అతని భార్యకు ఎస్పీ చేతుల మీదుగా హెల్మెట్‌ను అందచేసి కౌన్సెలింగ్ ఇచ్చారు.

క్రైమ్ కార్నర్

యువకుడి అదృశ్యం

చెరువులో గాలింపు చర్యలు

ద్వారకా తిరుమల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జి కొత్తపల్లిలో ఓ యువకుడి అదృశ్యం కలకలాన్ని రేపింది. కామవరపుకోట మండలం ఆడమిల్లికి చెందిన ఎస్ వినోద్‌కుమార్ (28)కూలి పనులు చేసుకుని కుటుంబ పోషణ చేస్తున్నాడు. ఈక్రమంలో నాలుగునెలల క్రితం అత్తారిల్లైన జి కొత్తపల్లి వచ్చి అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. బుధవారం రాత్రి కూలి డబ్బులు తీసుకొస్తానని ఇంటిలో చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెరువు గట్టుపై యువకుడి చెప్పులు, ద్విచక్రవాహనం, ఫోన్ ఉండటంతో భీమడోలు సీఐ విల్సన్, పోలీసులు గురువారం రాత్రి చెరువు వద్దకు వెళ్లి పరిశీలించారు. ఈ వ్యక్తి చెరువులో దూకిఉండవచ్చని అనుమానంతో చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు.

అక్రమ రేషన్ బియ్యం సీజ్

దోసపాడు గ్రామ పరిధిలో అక్రమంగా రేషన్ బియ్యం కలిగిన వారిపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో అక్రమం ఉన్న బియ్యం బస్తాలను సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

అనధికార మద్యం పట్టివేత

చింతలపూడి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అనధికార మద్యం సీసాలు కలిగిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. తడికలపూడి, కళ్ళచెరువు, కె.ఎస్.రామవరం, జీలకర్రగూడెం గ్రామాల్లో గస్తీలో 52 మద్యం బాటిళ్ళు నలుగురు వ్యక్తుల నుంచి దొరికాయని, విడివిడి కేసుల్లో వీరిని అరెస్టు చేసినట్టు చెప్పారు. ఈ దాడుల్లో ఎస్ఐలు అబ్దుల్‌ఖలీల్, ఆర్.వి.ఎల్.నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

దొంగ అరెస్టు

పెంటపాడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : దొంగతనం కేసులో వ్యక్తిని అరెస్టు చేసినట్లు పెంటపాడు ఎస్ఐ స్వామి తెలిపారు. మే నెల 5వ తేదీన పెంటపాడు గ్రామానికి చెందిన కేదారి అయప్ప ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తి చొరబడి బీరువాలోని బంగారం, వెండి వస్తువులు అపహరించుకు పోయాడు. గురువారం పెంటపాడులో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులకు అనుమానాస్పద స్థితిలో భీమవరానికి చెందిన జువ్వల అశోక్‌కుమార్ అనే వ్యక్తి తారసపడ్డాడు. దీంతో ఇతన్ని స్టేషన్‌కు తరలించి విచారించగా దొంగతనం చేసినట్లు అంగీకరించాడు. ఇతని వద్ద నుంచి రూ.80 వేలు విలువైన బంగారు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి తాడేపల్లిగూడెం కోర్టుకు తరలించగా, కోర్టు ఇతనికి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ స్వామి తెలిపారు.

ముగ్గురు మోటారు సైకిళ్ళ దొంగలు అరెస్టు

19 మోటారు సైకిళ్ళు స్వాధీనం

ఏలూరు క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : వివిధ ప్రాంతాల్లో మోటారు సైకిళ్ళు అపహరిస్తున్న ముగ్గురు వ్యక్తులను నూజివీడు టౌన్ పోలీసులు అరెస్టు చేశారని జిల్లా ఎస్పీ కెపిఎస్ కిషోర్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఎస్పీ వెల్లడించారు. నూజివీడులోని రాజీవ్ సర్కిల్ వద్ద రామన్నగూడెం రోడ్డువైపు నుంచి ముగ్గురు వ్యక్తులు మోటారు సైకిల్ పై అనుమానాస్పదంగా వస్తూ ఉండడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా వివిధ ప్రాంతాల్లో మోటారు సైకిళ్ళను అపహరించినట్లు వారు అంగీకరించారు. దీంతో వారిని అరెస్టు చేశారు. నిందితులు తెలంగాణ రాష్ట్రం వేంసూరి మండలం కల్లూరిగూడెం గ్రామానికి చెందిన బత్తుల పవన్‌కల్యాణ్ (27), భీమిరెడ్డి సీతారామిరెడ్డి (35) దూళ్ళ కొత్తూరు గ్రామానికి చెందిన ధనికొండ రమేష్ (32)లుగా గుర్తించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో మొత్తం 19 మోటారు సైకిళ్ళు ఈ ముగ్గురు అపహరించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారని ఎస్పీ చెప్పారు. బత్తుల పవన్‌కల్యాణ్ సత్తుపల్లి కాకతీయ డిగ్రీ కాలేజీలో బికాం కంప్యూటర్స్ చదివి ప్రస్తుతం హార్వెంగ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని, భీమిరెడ్డి సీతారామిరెడ్డి 9వ తరగతి వరకు చదివి మోటారు సైకిళ్ళ మెకానిక్‌గా పనిచేస్తున్నాడని, మూడో నిందితుడైన ధనికొండ రమేష్ గత 9 నెలలుగా ఆర్ అండ్ బి కాంట్రాక్టు వర్కర్‌గా పనిచేస్తున్నాడని, రాయుడుపాలెం గ్రామంలో బెల్టు షాపుకూడా నడుపుతున్నాడని వీరంతా చిన్ననాటి స్నేహితులు అని చెప్పారు. నేరస్తులను అరెస్టు చేయడంలో కీలకంగా విధులను నిర్వర్తించిన డీఎస్పీ ప్రసాద్, సీఐ సత్య శ్రీనివాస్‌కు, సిబ్బందికి ఎస్పీ కెపిఎస్ కిషోర్ ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సమావేశంలో ఎస్పీతోపాటు అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు, డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మాధవరంలో గురువారం రాత్రి చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి మాధవరంకు చెందిన మందపల్లి సాయి కుమార్(21) చిన్న వయస్సులోనే అమ్మ చనిపోవడంతో అమ్మమ్మ వద్దే ఉంటున్నాడు. కూలిపనులు చేసుకుంటూ అమ్మమ్మకు తోడుగా ఉండేవాడు. మూడు నెలల క్రితం రాజమండ్రి దివాన్‌చెరువుకు చెందిన అమ్మాయితో వివాహం జరిపించారు. అయితే మూడు రోజుల క్రితం సాయికుమార్ అత్తవారింటికి వెళ్లి తిరిగి గురువారం సాయంత్రం తిరిగి వచ్చాడు. అయితే ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం సేవించి ఇంట్లో ఫ్యాన్‌కు చున్ని కట్టి ఉరివేసుకున్నాడు. దీంతో అమ్మమ్మ నందికోళ్ల రామలక్ష్మి ఫిర్యాదు చేయడంతో రూరల్ ఏఎస్సై దుర్గారావు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

11 మంది అరెస్టు

ఆచంట, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): ఆచంట శివారు శేషమ్మచెరువు రోడ్డులో నక్కలకాలువగట్టు వద్ద గురువారం పేకాట ఆడుతున్న 11 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్దనుంచి రూ. 24,500 నగదుతో పాటు 52 పేక ముక్కలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కట్టా వెంకట రమణ తెలిపారు.

ప్రేమను ఒప్పుకోలేదని.. వివాహితపై హత్యాయత్నం

తిరుగుడుమెట్టలో ఘటన

పరారీలో దెందులూరు యువకుడు

తాళ్లపూడి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : తన ప్రేమను ఒప్పుకోలేదని ఒక ఉన్మాది వివాహితపై హత్యాయత్నానికి తెగబడ్డాడు. ఏలూరు జిల్లా దెందులూరు గ్రామానికి చెందిన ఆరేపల్లి హరినాథ్ డిగ్రీ చదివి ఖాళీగా ఉంటున్నాడు. ఇదిలా ఉండగా అంబేడ్కర్ కోనసీమ జిల్లా కే.గంగవరం గ్రామానికి చెందిన యువతి అమ్మమ్మగారి ఊరైన దెందులూరు వెళ్లింది. ఆ యువతిని చూసిన హరినాథ్ ప్రేమిస్తున్నానని వెంటపడే వాడు. అందుకు ఆమె ససేమిరా అంది. మా బంధువుల అబ్బాయితో పెళ్లి కుదిరింది వదిలేయమని వేడుకుంది.. అయినా పట్టించుకోకుండా వెంటపడుతూనే ఉండేవాడు. ఇదిలా ఉండగా ఆరు నెలల కిందట తూర్పు గోదావరి జిల్లా తిరుగుడుమెట్టకు చెందిన బంధువుల అబ్బాయితో వివాహమైంది. అయినా ఆమెను వదల్లేదు. ఫోన్ చేసి వేధిస్తూనే ఉన్నాడు. ఆమె స్పందించక పోవడంతో ఉన్మాదిగా మారి గురువారం ఉదయం తిరుగుడుమెట్ట గ్రామం చేరుకున్నాడు. నేను నిన్ను ప్రేమిస్తున్నాను.. పెళ్లి చేసుకుందాం రమ్మని పట్టుబట్టాడు.. అయినా మాటవినలేదు.. ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది.. స్థానికులు అడ్డుకోవడానికి ప్రయత్నిస్తుండగానే తన వెంట తెచ్చుకున్న చాకుతో ఆమె పొట్టభాగంలో పొడిచి పారిపోయాడు. దీంతో ఆమె గాయాలపాలైంది. స్థానికులు వెంటనే కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి బాగానే ఉన్నట్టు తెలిసింది.ఈ ఘటనపై తాళ్లపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. ఉన్మాది పరారీలో ఉన్నట్టు పోలీసులు చెప్పారు.

మామను నోటితో కొరికి గాయపర్చిన అల్లుడు

ముదినేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మామపై అల్లుడు దాడి చేసి శరీరంపై పలు చోట్ల కొరికి తీవ్రంగా గాయపరిచాడు. పోలీసులు తెలిపిన వివరాలివి.. దేవపూడికి చెందిన మట్లపూడి కనకారావు కుమార్తె స్టాలిన్ దేవితో పదిహేనేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన అబ్బిశెట్టి బాలాజీతో వివాహం జరిగింది. నాలుగేళ్ల కిందట భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తి పోలీస్ స్టేషన్‌లో కేసులు పెట్టుకోగా వివాదం కోర్టుకు చేరగా వాయిదాలు జరుగుతున్నాయి. భార్యాభర్తలు వేర్వేరుగానే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 20న స్టాలిన్ దేవి తండ్రి కనకారావుతో అల్లుడు బాలాజీ తగాదా పడి 'నువ్వు బతికున్నంత కాలం నా భార్య నా దగ్గరకు రాదు, నిన్ను చంపేస్తా' అంటూ మామపై దాడికి దిగి ఎడమ చేతి వేళ్లను, కంటి నొసలను కొరికేశాడు. దీంతో కనకారావును గుడివాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచా స్వాధీనం

పెదపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ చేశారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి స్వాధీనం చేసుకున్నట్లుగా పెదపాడు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు. ఏపూరు గ్రామంలో అద్దె ఇంటిలో కూటా పవన్‌కుమార్ బాణసంచా నిల్వ చేశాడు. వాటి విలువ రూ.1,56,826గా ఉంటుందని తెలిపారు. నిల్వ ఉంచిన వ్యక్తిపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెదవేగి: ముండూరు గ్రామానికి చెందిన కొనకళ్ళ వెంకటకృష్ణ అనే దుకాణదారుడు అనుమతులు తీసుకోకుండా దీపావళి మందుగుండు సామగ్రిని తీసుకువచ్చి అక్రమంగా నిల్వ చేశాడు. దీనిపై అందిన సమాచారంతో గురువారం సాయంత్రం దుకాణంపై దాడి చేసినట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. సుమారు రూ.20వేల విలువ చేసే దీపావళి మందుగుండు సామగ్రి లభించింది. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



ఆకివీడు సెంటర్‌లో దొంగల ఫొటోలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేసి మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నాగరాజు

ప్రయాణికులూ జర జాగ్రత్త !

దొంగలు మనతో ప్రయాణిస్తూ ఉంటారు. మన విలువైన వస్తువులపై కన్నేస్తారు. ముఖ్యంగా రద్దీగా ఉండే ఆటోలు, బస్సుల్లో ప్రయాణించే వారు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. ఆకివీడులో చోరీలకు పాల్పడుతున్న 48 మంది దొంగల ఫొటోలతో సెంటర్‌లో పోలీసులు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఈ ఫొటోలలో ఉన్న దొంగలు కన్పిస్తే అప్రమత్తంగా ఉండాలి, పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు. దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు.

- ఆకివీడు

రెండు తలల పాము



ద్వారకాతిరుమల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ద్వారకా తిరుమల వసంత్‌నగర్ కాలనీలో రెండు తలల పాము కన్పించింది. అరుదుగా కన్పించే ఈ పాము గురువారం హల్‌చల్ చేసింది. గ్రామానికి చెందిన కుర్రి అంజిబాబు అనే రైతు తన పొలంలో గేదెలకు పాలు తీసేందుకు గురువారం రాత్రి వెళ్లాడు. ఇదే సమయంలో అక్కడ ఈ రెండు తలల పాము ప్రత్యక్షమవడంతో ముందు భయపడ్డారు. అయితే ఇది విషరహితం కావడంతో దానిని స్థానికుల సహాయంతో ఖాళీ ప్రదేశంలో వదిలి వేశారు.

పోలియో వ్యాక్సిన్ తప్పనిసరి

ఏలూరు అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు పోలియో టీకాలను తప్పనిసరిగా వేయించాలని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ పోలియో నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో వైద్యఆరోగ్యశాఖ ఆధర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పిల్లలకు పోలియో చుక్కల మందు వేశారు. కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే బడేటి చంటి, డీఎంహెచ్‌వో నాగేశ్వరరావు, డీసీహెచ్‌ఎస్ పాల్‌సతీష్, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ శశిధర్ పాల్గొన్నారు.

కళాశాలకు నిధులు..

ఏలూరు అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించేందుకు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ హామీఇచ్చారు. ఎంపీని కళాశాల ప్రిన్సిపాల్ గిరిబాబు, వైస్ ప్రిన్సిపాల్ రాంబాబు తదితరులు గురువారం కలుసుకుని వినతిపత్రాన్ని అందజేశారు.

టీచర్ల 'సర్దుబాటు' చేయండి

ఏలూరు అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మున్సిపల్ పాఠశాలల్లో తక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలల నుంచి ఎక్కువ రోల్‌వున్న పాఠశాలలకు సర్‌ప్లస్ ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై సర్దుబాటు చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నగరశాఖ నాయకులు డీవైఈవో ప్రకాశ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. 8 మున్సిపల్ పాఠశాలల్లో టీచర్ల కొరతవున్నట్టు వివరించారు.

ఐక్యరాజ్యసమితి ఆవిర్భావ వేడుక

ఏలూరు అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఐక్యరాజ్యసమితి ఆవిర్భావ వేడుక పురస్కరించుకుని సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో గురువారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. 'ప్రపంచశాంతిని కాపాడడంలో ఐక్యరాజ్యసమితి పాత్ర' అంశంపై విద్యార్థినులకు వక్తృత్వ పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మరియా క్రిస్టియా పీవీ. రమణ, వి.వెంకటేశ్వరరావు, హేమసుందర్ ఆర్.చిట్టెమ్మ, జ్యోతికుమారి పాల్గొన్నారు.

టీచరు పోస్టు భర్తీకి దరఖాస్తు గడువు పొడిగింపు

ఏలూరు అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బుసరాజుపల్లిలోని పీఎంకే ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీ పోస్టు భర్తీకి దరఖాస్తు గడువును ఈ నెల 29 వరకు పొడిగించినట్టు డీఈవో అబ్రహం తెలిపారు. స్కూలు కరస్పాండెంట్‌కు లేదా సీఎస్ఈ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను అందజేయాలని కోరారు.

పీఎఫ్ ఖాతాలు నవీకరించాలి

ఏలూరు అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లా బదిలీలపై వచ్చిన టీచర్లకు పీఎఫ్ ఖాతాలను రెన్యువల్, అప్‌డేట్ చేయాలని ఏపీటీఎఫ్ జిల్లాశాఖ నాయకులు జడ్పీ సీఈవో సుబ్బారావుకు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడు రామారావు, నాయకులు ప్రకాశరావు, రామశేషుకుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు వివరిస్తున్న అసిస్టెంట్లు

మంత్రి పార్థసారథిని కలిసిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లు

లింగపాలెం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఖాళీగావున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చెయ్యాలని, తమకు ప్రమోషన్లు కల్పించాలని సెక్రటేరియట్ ఇంజనీర్స్ విభాగం ఉద్యోగులు మంత్రి కొలుసు పార్థసారథికి గురువారం వినతిపత్రం అందజేశారు. ధర్మాజీగూడెం శివారు వలసపల్లి తమ్మిలేరు వద్ద ఇసుక రీచ్ ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రిని ఇంజనీరింగ్ అసోసియేషన్ నేతలు కలిశారు. సమస్యలను ఆయనకు వివరించారు. పని భారంతో తమపై ఒత్తిడి పెరుగుతుందని, ఖాళీ పోస్టులను భర్తీ చెయ్యాలని, తమకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళతానని మంత్రి హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు. పులిచర్ల జగదీశ్, తేజ నాగకుమార్, రమేష్ నాయక్, సాయికుమార్, రవికిరణ్ పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న డీసీవో భారతి

గురుకుల పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్

పెదపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శాస్త్ర, సాంకేతిక, విజ్ఞానపరంగా విద్యార్థుల్లో దాగి వున్న ప్రతిభను వెలికితీయాలని, అందుకు ఇందుకు సైన్సు ఎగ్జిబిషన్‌లు ఎంతోగానో దోహదం చేస్తాయని గురుకుల పాఠశాలల డీసీవో నంబూరి భారతి తెలిపారు. వట్లూరులోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో జిల్లా స్థాయి సైన్సు ప్రాజెక్టుల ప్రదర్శన గురువారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఉత్తమంగా నిలిచిన ప్రాజెక్టులకు బహుమతులను అందజేశారు. ప్రిన్సిపాల్ మేరీ ఝాన్సీరాణి, గురుకుల పాఠశాల ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పంట బోదె మాయం..!

● కైకరంలో ఆక్రమణల పర్వం ● చెత్త చెదారంతో మురుగు ● రైతుల పాట్లు



పంట బోదెలో పేరుకుపోయిన గడ్డి తూడు

కైకరంలోని పంట బోదె ఆక్రమణలు, చెత్త చెదారంతో మూసుకుపోయింది. డ్రెయినేజీ, మరుగుదొడ్ల నీటితో మురుగు బోదెగా దుర్వాసన కొడుతోంది. చేలకు నీరు పెట్టడం వీలులేక రైతులు పాట్లు పడుతున్నారు. బోదెలో తూడు, గడ్డి పేరుకుపోయింది. నీరు పారక దుర్వాసన వస్తోందని స్థానికులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట బోదె ఆక్రమణలు తొలగించి నీరు పారుదలకు ఇరిగేషన్ అధికా రులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. పంట బోదె సమస్యను పంచాయతీ కార్యదర్శికి వివరించామని రైతులు తెలిపారు. - ఉంగుటూరు

పట్టించుకోని అధికారులు

పంట బోదె సమస్యపై అనేక మార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోలేదు. కొంత మంది పంట బోదెను మురుగు బోదెగా మార్చారు. నాయకులకు చెప్పినా ప్రయోజనం లేదు. చేలకు నీరందేలా చర్యలు తీసుకోవాలి.



చింతాడ పెద్దిరాజు, రైతు

మురుగు బోదెగా మార్చేశారు

భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాను. పంట బోదెలో సాగు నీరు బదులు మురుగు బోదెగా మారింది. ఇరిగేషన్ రెవెన్యూ సిబ్బంది చర్యలు తీసుకోవాలి. సమస్య పరిష్కరించి రైతులకు మేలు చేయాలని కోరుతున్నారు.



అప్పారావు, కౌలు రైతు



మురుగు బోదెను తలపిస్తున్న పంట బోదె

ఏజెన్సీలో మరో ఏకలవ్య స్కూల్ : ఎంపీ మహేశ్



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీ మహేశ్

బుట్టాయగూడెం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో మరో ఏకలవ్య రెసిడెన్షియల్ మోడల్ స్కూల్ ఏర్పాటుకు కృషి చేస్తానని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్ తెలిపారు. విప్పలపాడు ఏకలవ్య మోడల్ స్కూల్‌ను గురువారం ఆయన పరిశీలించారు. పిల్లలకు సౌకర్యాలు, ఉత్తీర్ణత శాతాన్ని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నూరుశాతం ఉత్తీర్ణత సాధనకు ఉపాధ్యాయులు కృషిచేయాలని తెలిపారు. కొయ్యలగూడెంలో డిగ్రీ కళాశాల, అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని ఎంపి తెలిపారు. ఏజెన్సీలో 2 వేల కోట్ల ఖర్చుతో ఆయుధ కర్మాగారం నిర్మాణానికి కేంద్రం సుముఖంగా ఉందని, కొందరు కర్మాగారం నిర్మాణం జరగకుండా అడ్డుపడుతున్నా రని తెలిపారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, ఏపీవో పీవీఎస్ నాయుడు, ఏఎంవో కె.శిరమయ్య, డీవైఈవో కె.నీలయ్య, ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ మిశ్రా, నాయకులు మొగపర్తి సోంబాబు, యంత్రప్రగడ శ్రీనివాసరావు, గద్దె అబ్బులు, కరాటం సాయిబాబా, నల్లూరి కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులు, అక్రమ మద్యం తక్షణం అరికట్టాలి

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అక్రమ మద్యం ఏరులై పారుతుందని, బెల్టు షాపులు నిర్మూలించాలని ఏపీ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గీత కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు బెజవాడ వెంకటేశ్వరరావు అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. నరసింహమూర్తి మాట్లాడుతూ వారం రోజుల్లోనే బెల్టు షాపులు పుట్టగొడుగుల్లా వెలిశాయన్నారు. కల్లు దుకాణాలు మూతపడే ప్రమాదం పొంచి ఉందన్నారు. గీత కార్మికులు అడక్కుండానే కల్లుసొసైటీలకు బ్రాందీ షాపులు ఇస్తామని ఆశలు కల్పించి కల్లు లేకుండా చేసి మద్యం అమ్మకాలు పెంచుకునేలా ప్రభుత్వం ఎత్తుగడ వేసిందన్నారు. పొరుగు రాష్ట్రాలు కల్లుగీతను అన్నిరకాలుగా ఆదుకుంటూ సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే ఏపీలో కల్లు అనేది లేకుండా చేయాలనుకోవడం నాలుగు లక్షల గీత కుటుంబాలకు అన్యాయం చేసినట్టు అవుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గీత కార్పొరేషన్లను పునరుద్ధరించాలని, గీత కార్మికులకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో కల్లుగీత కార్మిక సంఘ నాయకులు బొక్కచంటి, కడలి పాండు, తోళం సత్యనారాయణ, పరసా పోతురాజు, మరీదు తులసీరావు, బెజవాడ మోహన్‌రావు, బెజవాడ సీతారామయ్య పాల్గొన్నారు.

జనసేన పార్టీపై వివక్ష : కార్యకర్తల ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న కరాటం రాంబాబు

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 24: చింతలపూడి నియోజకవర్గంలో జనసేనపై టీడీపీ నేతలు వివక్ష చూపుతున్నారని పలువురు కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గ జనసేన కార్యకర్తల ఆత్మీయ సమావేశం మేకా ఈశ్వరయ్య అధ్యక్షతన గురువారం జరిగింది. డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నాయకుల వద్ద పలువురు కార్యకర్తలు గోడు వెళ్ళబోసుకున్నారు. ఎన్నికల ముందు టీడీపీ నాయకులు జనసేనతో ఉన్నట్లు ఎన్నికల తర్వాత ఉండడం లేదని ఆరోపించారు. నామినేటెడ్ పోస్టుల్లో జనసేనకు 50 శాతం కేటాయించేలా పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌తో మాట్లాడి పార్టీ పటిష్టానికి కృషి చేయాలని కరాటం రాంబాబును కోరారు. జనసేన పార్టీని చిన్నచూపు చూస్తే తగిన మూల్యం చెల్లించకోక తప్పదన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి గురుజు ఉమా, ఆకుల రాకేష్, కౌన్సిలర్ వలవల తాతాజీ, షేక్ పీరు, చీదరాల మధుబాబు, షేక్ వలీ, చింతల నాని, ఉక్కుర్తి సీతారాం, తిరు మలశెట్టి రవి, రామారావు, నరేష్, నాలుగు మండలాల జనసేన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా జయవరపు పుట్టినరోజు వేడుకలు

టి.నరసాపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జయవరపు శ్రీరామమూర్తి పుట్టినరోజు వేడుకలను గురువారం ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. పలువురు నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మొడియం శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు రామకృష్ణ గౌడ్, బొంతు సత్యనారాయణ, జయవరపు వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ బీమవరపు జగన్మోహన్ రావు, జయవరపు శ్రీను, గుండు శ్రీను, అగ్నిపర్తి బిక్షమయ్య, లింగారెడ్డి శ్రీను పాల్గొన్నారు.

రైతుల వినతి మేరకు విచారణ జరిపిస్తాం

కామవరపుకోట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలపై రైతుల వినతి మేరకు విచారణ జరుపుతామని తహసీల్దార్ గెడ్డం ఎలీషా తెలిపారు. కొండగూడెం సచివాలయం వద్ద గురువారం గ్రామసభ నిర్వహించారు. పలువురు రైతులు రికార్డుల్లో చేర్పులు, మార్పులపై వినతులు అందజేశారు. ఆర్ఐ పి.రామకృష్ణ, డీటీ బి.సౌజన్య, సర్వేయర్ కె.లత, వీఆర్వో కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: రామన్నపాలెం గ్రామ సభలో 33 దరఖాస్తులు అందాయని తహసీల్దార్ టీఎస్ సాయిబాబా తెలిపారు. పీఎస్ పవన్‌కుమార్, డీటీ స్రవంతి, వీఆర్వో బోస్, ఎస్‌కే వలి, ఎల్లిన సురేష్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం: భూముల రీసర్వే సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని తహసీల్దార్ నజీముల్లాషా అన్నారు. భూసమస్యలపై అర్జీలు ఎక్కువగా వస్తున్నాయన్నారు. డీటీ నాగబాబు, చలపతిరావు, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: సాగులో ఉన్న గిరిజనులకు హక్కు పట్టాలు ఇవ్వాలని తహసీల్దార్ చలపతిరావుకు సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. కారం భాస్కర్, జోడే సూర్యచంద్రరావు, అన్నపూర్ణ, శ్రీనివాసరావు, రాజు, దుర్గమ్మ, కృష్ణ, వెంకటలక్ష్మి, నాగమణి పాల్గొన్నారు.



ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

హెల్మెట్‌తో ప్రాణానికి భద్రత : ఎమ్మెల్యే రోషన్

చింతలపూడి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ భారం కాదు భద్రత అని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు ముమ్మరం చేశారు. బోసుబొమ్మ సెంటర్‌లో గురువారం అవగాహన ర్యాలీ ప్రారంభించారు. స్వయంగా ర్యాలీలో పాల్గొని వాహనదారులను నిలిపి హెల్మెట్ వలన ఉపయోగాలు తెలియజేశారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, లేదంటే జరిమానా చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్లు నడిపే ప్రతీ ఒక్కరూ సీటు బెల్టు ధరించాలని సూచించారు. ఆర్యవైశ్య సంఘం, మెడికల్ అసోసియేషన్ అందించిన 15 హెల్మెట్‌లను ఆయన పంపిణీ చేశారు. కె.రాజారెడ్డి, మాటూరి వెంకట్రామయ్య, అట్లూరి శ్రీనివాసరావు, చిట్లూరి ధర్మరాజు, కొత్తపూడి శేషగిరిరావు, వజ్రపు శేఖర్, సిఐ రవీంద్ర, ఎస్ఐ కుటుంబరావు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి కార్యాచరణ

ఉంగుటూరు: నియోజకవర్గంలో వంద శాతం సీసీ రహదారుల నిర్మాణానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సూచించారు. వివిధ శాఖల అధికారులతో గురువారం ఆయన సమీక్షించారు. నిర్మాణం నిలిచిన ప్రభుత్వ భవనాల పునర్నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. చికెన్ వ్యర్థాలు ఉపయోగించే ఆక్వా రైతులపై చర్యలు తీసుకోవాలన్నారు. నీటి సంఘాల ఎన్నికలు సజావుగా సాగేలా రైతులు చొరవ తీసుకోవాలన్నారు. డ్రెయిన్లలో పూడిక తొలగించాలన్నారు. సమీక్షలో ఇరిగేషన్, ఆర్‌అండ్ బి, డ్రెయిన్స్, మత్స్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు జాబ్ మేళా

నిరుద్యోగులు జాబ్ మేళా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు. సెట్‌వెల్ సీఈవో ప్రభాకరరావు, ప్రిన్సిపాల్ టీకే.విశ్వేశ్వరరావు, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి మధుసూదనరావు, కొండా రవి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జాన్ కెనడీ తదితరులు పాల్గొన్నారు. 80 మంది హాజరు కాగా 11మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని కోఆర్డినేటర్ రవి వివరించారు.

నారాయణపురం జూనియర్ కళాశాల నూతన భవనాల నిర్మాణంపై ప్రిన్సిపాల్, డీవీఈవో బి.ప్రభాకరరావుతో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు చర్చించారు. ఆర్ అండ్ బి శాఖ ఎస్ఈ వద్ద నూతన భవనాల నిర్మాణానికి అంచనా తీసుకోవాలని సూచించారు.

జాతీయ రహదారి నిర్మాణంపై జేసీ పరిశీలన



రహదారి మేప్ పరిశీలిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

జీలుగుమిల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టిసీమ వరకు నిర్మించే జాతీయ రహదారి 365 బీబీ నిర్మాణ క్రమంలో జీలుగుమిల్లి నాలుగు రోడ్ల కూడలిని జేసీ ధాత్రిరెడ్డి గురువారం పరిశీలించారు. రోడ్డు నిర్మాణ మేప్‌ను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా భూ సేకరణలో సమస్యలు రాకుండా రెవెన్యూ అధికారుల్ని సంప్రదించాలన్నారు. గ్రామంలో జగదాంబ, సుబ్రమణ్యస్వామి ఆలయాలు రోడ్డు నిర్మాణంలో తొలగించాల్సి వస్తే ఆలయాల నిర్మాణానికి స్థలం చూసుకోవాలని తగిన పరిహారం చెల్లిస్తామని స్థానికులకు తెలిపారు. రోడ్డు నిర్మాణంలో భూమిని కోల్పోయే వారికి ఎకరాకు సుమారు రూ.15లక్షలు చెల్లిస్తామన్నారు. చెట్లు, భవన నిర్మాణాలు ఉంటే వాటికి తగిన సొమ్ము చెల్లిస్తామన్నారు. తాటియాకులగూడెం, జీలుగుమిల్లి, బర్రింకలపాడు, పి.అంకంపాలెం, పి.నారాయణపురం, రౌతుగూడెం గ్రామాలు, కొన్ని ఎల్‌టీఆర్‌లో ఉన్న భూములు పరిశీలిస్తామన్నారు. బర్రింకలపాడు గురుకుల పాఠశాల వద్ద నిర్మించిన ప్రహరీకి నష్టపరిహారం చెల్లించే విషయమై ఎన్‌హెచ్ అధికారులతో మాట్లాడారు. పాఠశాలకు చెందిన 1ఎకరం 50సెంట్ల భూమి, ఇతర ప్రభుత్వ భూములు కొంత ఎన్‌హెచ్ రోడ్డు నిర్మాణ పరిధిలో ఉన్నాయన్నారు. మండలంలో 20 ఎకరాలు ప్రైవేటు భూమి ఉందన్నారు. తహసీల్దారు బి.సందీప్, ఎన్‌హెచ్ అధికారులు ఆర్.పోతురాజు, ఏఈ కాజా, వీఆర్వోలు మాధురి, బుల్లిఅబ్బులు, సర్వేయర్లు ఉన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

బుట్టాయగూడెం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై డి.దుర్గా మహేశ్వరావు సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ మనీంద్రరావు అధ్యక్షతన గురువారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాలకు అలవాటుతో కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయని, జీవితాలను ఏవిధంగా నాశనం చేసుకుంటున్నారో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

లింగపాలెం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలని ఎస్ఐ వెంకన్న సూచించారు. ధర్మాజిగూడెంలో గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనాలకు సంబంధించి అన్ని ధృవపత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. అతివేగంతో ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దని, మద్యం మత్తులో వాహనాలను నడపకూడదని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా విధిస్తామన్నారు. తనిఖీలలో ఆయనతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్‌ను కలిసిన డీఎస్పీ

పోలవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్‌ను గురువారం డీఎస్పీ ఎం వెంకటేశ్వరరావు ఆయన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి పూలబోకేతో శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీఐ బాల సురేశ్‌బాబు, ఎస్ఐ ఎస్ఎస్ఎస్ పవన్ కుమార్, డీఎస్పీ కార్యాలయ పోలీస్ అధికారి రామలక్ష్మి పాల్గొన్నారు.



ఏలూరులో గంబూసియా చేపలను జారవిడుస్తున్న వైద్యసిబ్బంది



బుట్టాయగూడెం మండలం ఎస్ఆర్‌పాలెం చెరువులో..



భీమడోలు మండలం పోలసానపల్లిలో..

దోమల వ్యాప్తికి అడ్డుకట్ట

నీటి నిల్వ ప్రాంతాల్లో గంబూసియా చేపలు వదిలిన వైద్య సిబ్బంది

ఏలూరు అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దోమలవ్యాప్తిని అరికట్టేందుకు మురికి కాల్వలు, నీటి నిల్వ ప్రదేశాల్లో గంబూసియా చేపలను జారవిడిచే కార్యక్రమాన్ని గురువారం వైద్య ఆరోగ్య శాఖ మలేరియా విభాగం, నగర పాలక సంస్థ సంయుక్తంగా చేపట్టాయి. నగరంలోని యాదవనగర్, బడేటి నగర్‌లలో డ్రైన్లు, నీటినిల్వ ప్రాంతాల్లో చేపలను వేసిన అనంతరం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ గంబూసియా చేపలతో దోమల నిర్మూలన చర్యలు చేపట్టామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రజల భాగస్వామ్యంకూడా ముఖ్యమన్నారు. అదనపు కమిషనర్, మున్సిపల్ హెల్తాఫీసర్ చంద్రయ్య, అర్బన్ పీహెచ్‌సీల వైద్యాధికారులు ప్రదీప్తి, అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, వైద్య సిబ్బంది శ్రీనివాసరావు, రమేష్‌బాబు, విజయనిర్మల, జ్యోతి, రెహముస్నీసా బేగం, రాజేశ్వరి, ఉమ, స్థానిక టీడీపీ నాయకులు తంగిరాల అరుణ, అర్నేపల్లి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలోని ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న చెరువులు, కాలువలు, మురుగుగుంటల్లో గురువారం గంబూషియా చేపలను వదిలినట్టు ఐటీడీఏ ఉప వైద్యాధికారి జె.సురేష్‌కుమార్ తెలిపారు. నూతిరామన్నపాలెం శివారులోని చెరువులో గంబూషియా చేపలను వదలినట్లు తెలిపారు. దోమల లార్వాను గంబూసియా చేపలు తినడంతో దోమలను నివారించవచ్చన్నారు. ఎ.రామరాజు, పి.శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

● భీమడోలు: పోలసానపల్లి, భీమడోలు గ్రామాల్లో నీటి నిల్వలు ఉన్న చోట వైద్యాధికారులు, సిబ్బంది గంబూసియా చేపలను వదిలారు. డాక్టర్ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ఏలూరు యూనిట్ నుంచి వైద్యులు సీహెచ్ రమేష్ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల పారిశుధ్య సిబ్బంది ఆందోళన విరమణ

ఏలూరు క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రులలో పారిశుధ్య కార్మికులకు జీతాలు, పీఎఫ్ చెల్లిస్తామని ఫస్ట్ ఆబ్జెక్టు ఏజెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ కాంట్రాక్టర్ రాతపూర్వకంగా హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమిస్తున్నట్లు మెడికల్ కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె కృష్ణమాచార్యులు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.దత్తాత్రేయులు తెలిపారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి, మెడికల్ కాలేజీ, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, బుట్టాయిగూడెం, పోలవరం, దెందులూరు, భీమడోలులోని పారిశుధ్య కార్మికులకు ఐదు నెలలుగా జీతాల బకాయి, పీఎఫ్ బకాయిలు చెల్లించాలని ఐదు రోజులుగా ఆందోళన చేపట్టారు. ఈనెల 30 లోపు రెండు నెలల జీతాలు చెల్లిస్తామని నవంబరు 18లోపు మొత్తం జీతాల బకాయి, పీఎఫ్ కూడా చెల్లిస్తామని కాంట్రాక్టర్ హామీ ఇచ్చారని వారు తెలిపారు. నవంబరు 1న తలపెట్టిన నిరవధిక సమ్మెను విరమిస్తున్నామని అధ్యక్షులు కృష్ణమాచార్యులు, ప్రధాన కార్యదర్శి పి దత్తాత్రేయులు తెలిపారు.

● జంగారెడ్డిగూడెం: పెండింగ్ జీతాల కోసం ఐదు రోజులుగా ఆసుపత్రి పారిశుధ్య కార్మికుల నిరసన దీక్షలు గురువారం విరమించినట్లు సీపీఐ మండల కార్యదర్శి జేవీ.రమణరాజు తెలిపారు. కాంట్రాక్టర్‌తో చర్చలు సఫలం కావడంతో ఆందోళన విరమించామన్నారు. కుంచె వసంతరావు, గొలిమే బాలఏసు, వేముల రాజు, సంజీవ్, దయామణి, ప్రభావతి, చంద్రకళ, మేరీ, జ్యోత్న్న పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు. చికెన్ వ్యర్థాలను గ్రామం బయట గొయ్యి తీసి పూడ్చి పెట్టించినట్లుగా చెప్పారు. చెరువు, వాహన యజమానులు, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

14మంది జూదరుల అరెస్ట్

టి.నరసాపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై దాడిచేసి 14మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఎం.జయబాబు గురువారం తెలిపారు. అప్పలరాజుగూడెం గ్రామ శివారులో పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారంతో సిబ్బందితో దాడి చేశారు. పేకాడుతున్న 14 మందిని అరెస్ట్‌చేశారు. వారి వద్ద రూ. 1,79,500 నగదు, 4 ద్విచక్ర వాహనాలు, 2 కార్లను స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మత్తులో కిళ్లీ దుకాణానికి నిప్పు

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 24: మద్యం మత్తులో కిళ్లీ దుకాణానికి నిప్పు పెట్టడంతో రూ. 75 వేల సరుకు దగ్ధమైంది. నిప్పు పెట్టిన దల్లి సాయిని అరెస్టు చేసినట్లు రైటర్ శ్రీనివాస్ తెలిపారు. లక్కవరం మద్యం దుకాణం సమీపంలో చిట్టిబొమ్మ నాగేశ్వరమ్మకు చెందిన కిళ్ళీ దుకాణానికి గురువారం తెల్లవారుజామున సాయి నిప్పు పెట్టాడు. దుకాణ యజమాని ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

మహిళ అదృశ్యం

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 24: మండలంలోని కేతవరం గ్రామానికి చెందిన మహిళ ఆడమిల్లి శైలజ ఈ నెల 21 నుండి కనిపించడం లేదని ఆమె సోదరుడు ఇసనంపల్లి రాంబాబు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు హెచ్‌సి.భీమశేఖర్ తెలిపారు. కేతవరం గ్రామానికి చెందిన ఆడమిల్లి రాజుతో వివాహం కాగా ఇద్దరు పిల్లలున్నారన్నారు. భార్యాభర్తల మధ్య తరచు గొడవల నేపథ్యంలో ఈ నెల 21 నుంచి శైలజ కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు రూరల్ :** రామకృష్ణాపురంలోని సాహిత్యమండలి ప్రాంగణంలో ఉదయం ఏఎస్ఆర్ అవార్డు ప్రదానోత్సవం జరుగుతుందని నిర్వాహకులు గరికపాటి కాళిదాసు ఒక ప్రకటనలో తెలిపారు.
- వైసీపీ హయాంలో అనేక ఇబ్బందులు పడిన తెలుగుదేశంపార్టీ కార్యకర్తలను గుర్తించి సముచితస్థానం కల్పించాలని టీడీపీ నేత సైదు గోవర్ధన్ విజ్ఞప్తి చేశారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం ఈనెల 31న నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆవిర్భావ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరించారు.
- **ఉంగుటూరు :** గోపీనాథపట్నంలో తాగునీటి సమస్య నెలకొనడంతో ఎమ్మెల్యే ఆధ్వర్యంలోని లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ట్యాంకర్‌తో తాగునీరు అందజేశారు.
- ఉంగుటూరు మండలం యర్రమిల్లిపాడు పాఠశాలలో పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోలీసు అమరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎస్ఐ సూర్య భగవాన్, సర్పంచ్ తమ్మిన శ్రీను, ఆర్.మురళీకృష్ణ పాల్గొన్నారు.
- **నిడమర్రు :** స్థానిక ఉన్నత పాఠశాలలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పెదనింద్రకొలను పీహెచ్‌సీ వైద్యాధికారి కె.భాగ్యశ్రీ 256 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. హెచ్‌ఎం వి.రాజేశ్వరి, ఉపాధ్యాయులు అప్పారావు పాల్గొన్నారు.
- **భీమడోలు :** మండలంలోని పలు పేద కుటుంబాలకు భీమడోలు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థిక సహాయం, నిత్యావసర సరుకులను అందజేసింది.
- **జంగారెడ్డిగూడెం:** మండలంలోని నిమ్మలగూడెంలో విద్యుదాఘాతంతో మృతి చెందిన కంకిపాటి నాగరాజు కుటుంబానికి మానవత ఉపాధ్యక్షుడు అల్లూరు రామకృష్ణ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు.
- జంగారెడ్డిగూడెం పట్టణంలోని కనకదుర్గ ఫైనాన్స్ లిమిటెడ్‌లో మేనేజరు, క్యాషియర్, మరో ఇద్దరితో కలిసి నకిలీ బంగారంతో రూ.23 లక్షలు తీసుకున్నారు. కంపెనీ ప్రతినిధి హేమంత్ కుమార్ ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కె.జబీర్ తెలిపారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు

నెరవేరనున్న దశాబ్దాల కల

ఏలూరులో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులకు శ్రీకారం



తంగెళ్లమూడిలో మురుగునీటి శుద్ధి కేంద్రం

ఏలూరు టూ టౌన్, సెప్టెంబరు 24:ఏలూరు నగర వాసులకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ దశా బ్దాల కల. ఈ స్వప్నాన్ని కూటమి ప్రభుత్వం త్వరలో నిజం చేయబోతుంది. ఎన్నో ప్రభు త్వాలు వచ్చినా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థకు శ్రీకారం చుట్టలేదు. 2014లో అధి కారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి పూనుకుంది. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకంలో రూ.37.48 కోట్లు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి మంజూరు చేసింది. చింతలపూడి సబ్ బేసిన్ ప్రాంతంలో తంగెళ్ళ మూడిలో 50 లక్షల లీటర్ల మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్‌టీపీ) ఏర్పాటుకు పనులు ప్రారం భించారు. ఈ ఆరు డివిజన్లలో ఉత్పన్న మయ్యే సెప్టిక్ ట్యాంకుల్లో ఉన్న వ్యర్థాన్ని శుద్ధి చేసే ప్లాంట్లు నిర్మాణానికి పనులు ప్రారంభించారు. ఆరు డివిజన్స్‌లోని 21 కిలోమీటర్ల దూరంలో భూమిలో పైపులైన్లు వేయడానికి ప్రతి పాదనలు సిద్ధం చేశారు. రాబోయే 30 సంవత్సరాల్లో ప్రజల అవసరాలు తీర్చే విధంగా అండర్ గ్రౌడ్ డ్రైనేజీ డిజైన్ చేశారు. ఈ శుద్ధి కేంద్రాన్ని పదేళ్ళ తరువాత పెంచు కునేలాగా డిజైన్ చేశారు. అమృత్ పథకంలో యూజీడీ నిర్మాణానికి 38.48 కోట్లు మంజూరు చేశారు. దీనిలో కేంద్ర ప్రభుత్వం వాట 10.05 కోట్లు రాష్ట్రం వాటా 3.94 కోట్లు, నగరపాలక సంస్థ వాటా 14.18 కోట్లు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వాటా 9.31 కోట్లుగా నిర్ణయిం చారు. 2018 సంవత్సరంలో అనాటి టీడీపీ ప్రభుత్వం పనులు ప్రారంభించింది. ఆయా డివిజన్స్‌లో పైపులైన్ల పనులు ప్రారం భించారు. 1వ డివిజన్ పాత డంపింగ్ యార్డు వద్ద మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణాలు మొదలుపెట్టారు. ఈ పనులు మధ్యలో ఉండగానే ఎన్నికలొచ్చాయి. ఎన్నికల అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులన్నీ ఎక్కడివి అక్కడే ఆగిపోయాయి.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెను వెంటనే యూజీడీ పనులు ప్రారంభించింది. ప్రభుత్వం వచ్చిన 100 రోజుల లోపే డంపింగ్‌యార్డు వద్ద 50 లక్షల లీటర్ల మురుగునీటి శుద్ధి కేంద్రం పనులు పూర్తి చేసింది. ట్రయల్ రన్‌ను ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య ప్రారంభించారు.



వన్ టౌన్‌లో పనులకు డీపీఆర్

వన్‌టౌన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు రూ.112 కోట్లతో డీపీఆర్ తయారు చేశారు. పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఇంజ నీరింగ్ ఇన్ చీఫ్‌తో టెక్ని కల్ సేంక్షన్ కోసం పంపించారు. త్వరలో అనుమతి వచ్చే అవకాశం ఉంది. అనుమతి లభించిన తరువాత టెండర్ల పనులు ప్రారంభిస్తారు. ఇందులో భాగంగా పోణంగిలో 15 ఎంఎల్‌డీ సామర్థ్యంతో మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేస్తారు. 7వ డివిజన్ నుంచి 17వ డివిజన్ వరకు 38 కిలోమీటర్ల మేర 3 పైపులైన్లు వేస్తారు. లక్ష్మమ్మకోనేరు, వెంకటాపురంలో రెండు పంపింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తారు. ఈ పంపింగ్ స్టేషన్ వద్దకు వచ్చిన మురుగు నీటిని శుద్ధి చేసి వెంకన్న చెరువుకు పంపి స్తారు. దీనిలో భాగంగా పది కిలోమీటర్లలో ఉన్న పాత పైపులైన్లను మరమ్మతులు, పూడిక తీస్తారు. 1980లో వన్‌టౌన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిం చారు. దానికి సంబంధించిన మురుగు నీటి శుద్ధి కేంద్రం పైపులైన్లు పూడుకు పోయాయి. దీంతో నూతన టెక్నాలజీతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.

భీమవరంలో క చిత్రం ప్రమోషన్



క చిత్రం ప్రమోషన్ విడుదల చేస్తున్న హీరో కిరణ్ అబ్బవరం

భీమవరం టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : భీమ వరంతో ఎంతో అనుబంధం ఉందని, ఇప్పటికి నాలుగు సార్లు భీమవరం వచ్చానని తన మొదటి షార్ట్ ఫిలిం 'ఓ మనసా ఇటు రావే' భీమవ రంలోనే చేశామని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. 'క' చిత్రం ప్రమోషన్స్‌లో భాగం గా భీమవరం నాయుడు గారి కుండ బిర్యానీలో కిరణ్ గురువారం సందడి చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్ఆర్ కళ్యాణ మండపం, సంక్రాంతి వేడుకలకు ఈ ప్రాంతానికి వచ్చానని, మీరు చూపించే ఆదరణ ఎప్ప టికి మరవలేనన్నారు. ఈనెల 31న చిత్రం విడుదలవుతుందన్నారు.1977 నాటి అంశాల ఆధారంగా ఈ చిత్రాన్ని చేశామని గొప్ప విజయం అందిస్తారని కోరుకుంటు న్నామ న్నారు. ఈ చిత్రాన్ని చూసి ఆ టికెట్ రాష్ట్రంలోని నాయుడు గారి కుండ బిర్యానీ 36 బ్రాంచ్‌ల్లో ఎక్కడ చూపించినా రాయి తీపై ఫుడ్ అందిస్తారన్నారు.

మోటారు సైకిళ్ల దొంగలు అరెస్టు

ఏలూరు క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : వివిధ ప్రాంతాల్లో మోటారు సైకిళ్ళు అపహ రిస్తున్న ముగ్గురు వ్యక్తులను నూజివీడు టౌన్ పోలీసులు అరెస్టు చేశారని జిల్లా ఎస్పీ కెపిఎస్ కిషోర్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాల యంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఎస్పీ వెల్లడిం చారు. నూజివీడులోని రాజీవ్ సర్కిల్ వద్ద రామన్నగూడెం రోడ్డువైపు నుంచి ముగ్గురు వ్యక్తులు మోటారు సైకిల్ పై అనుమానాస్ప దంగా వస్తూ ఉండడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా వివిధ ప్రా ంతాల్లో మోటారు సైకిళ్లను అపహరించినట్లు వారు అంగీకరించారు. దీంతో వారిని అరెస్టు చేశారు. నిందితులు తెలంగాణ రాష్ట్రం వేంసూరి మండలం కల్లూరిగూడెం గ్రామానికి చెందిన బత్తుల పవన్‌కల్యాణ్ (27), భీమిరెడ్డి సీతారా మిరెడ్డి (35) దూళ్ళ కొత్తూరు గ్రామానికి చెం దిన ధనికొండ రమేష్ (32)లుగా గుర్తించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో మొత్తం 19 మోటా రు సైకిళ్ళు ఈ ముగ్గురు అపహరించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారని ఎస్పీ చెప్పారు. బత్తుల పవన్‌కల్యాణ్ సత్తుపల్లి కాకతీయ డిగ్రీ కాలేజీలో బికాం కంప్యూటర్స్ చదివి ప్రస్తుతం హోల్డింగ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని, భీమిరెడ్డి సీతారామిరెడ్డి 9వ తరగతి వరకు చదివి మోటారు సైకిళ్ళ మెకానిక్‌గా పనిచేస్తున్నాడని, మూడో నిందితుడైన ధనికొండ రమేష్ గత 9 నెలలుగా ఆర్ అండ్ బి కాంట్రాక్టు వర్కర్‌గా పనిచేస్తున్నాడని, రాయుడుపాలెం గ్రామంలో బెల్టు షాపుకూడా నడుపుతున్నాడని వీరంతా చిన్ననాటి స్నేహితులు అని చెప్పారు. నేరస్తు లను అరెస్టు చేయడంలో కీలకంగా విధులను నిర్వర్తించిన డీఎస్పీ ప్రసాద్, సీఐ సత్య శ్రీనివా స్‌కు, సిబ్బందికి ఎస్పీ కెపిఎస్ కిషోర్ ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సమావేశంలో ఎస్పీతోపాటు అదనపు ఎస్పీ ఎన్ సూర్యచం ద్రరావు, డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన యాదవ సంక్షేమ సంఘం నాయకులు

కైకలూరు (ముదినేపల్లి), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్‌ను కైకలూరు నియోజకవర్గ శ్రీకృష్ణా యాదవ సంక్షే మ సంఘం నాయకు లు మర్యాద పూర్వకం గా కలిశారు. ఏలూరు లోని ఎంపీ కార్యా లయంలో బుధవారం రాత్రి యాదవ సంక్షేమ సంఘ నాయకులు టీకే ఎం నాని, కరేటి శ్రీహరి, నున్న భగవానులు, గంగుల అశోక్, బూరు బోయిన శ్రీని వాసరావు, తదితరులు ఎంపీని కలి శారు. నియో జవకర్గం లో యాదవుల సంక్షే మానికి ప్రభు త్వప రంగా మరిన్ని సంక్షేమ కార్యక్రమాల అమలుకు కృషి చేయాలని ఎంపీ ని కోరారు. నియోజ కవర్గ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీహరిని ఎంపీ అభినం దించారు.

తాగడానికి గుక్కెడు నీరు లేక..

- 20 వేల మంది తీవ్ర ఇబ్బందులు
- గోదావరి నీటితో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారమంటున్న గ్రామస్తులు
- జలజీవన్ మిషన్ ద్వారా నిధులు మంజూరు చేస్తాం
- కలెక్టర్ వెట్రిసెల్వి హామీ

ఆ గ్రామాల్లో చుట్టూ చేపలు, రొయ్యల చెరువులు ఉన్నప్పటికీ తాగటానికి గుక్కెడు నీరు లేక పలు అవస్థలు పడుతున్నారు. తాగునీటి చెరువులు అడుగంటితే తాగునీటి వంతు ఎప్పటికీ ఇస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.



పెదలంకలో అడుగంటిన తాగునీటి చెరువు(ఫైల్) (ఇన్‌సెట్‌లో) ఏలూరుపాడు లాకులు

కలిదిండి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు శివారు ఉన్న ఉప్పుటేరు తీర గ్రామాల్లో ఉన్న దీర్ఘకాలిక తాగునీటి సమస్య పరిష్కరిం చాలని ఉప్పుటేరు తీర గ్రామాల ప్రజలు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. కొండంగి పల్లిపా లెం, యడవల్లి, దళితవాడ, మట్టగుంట, బోడ్డు వానిగట్టు, పెదలంక, పల్లిపాలెం అప్పారావుపేట, పెదపుట్లపూడి గ్రామాల్లో సుమారు 20 వేల జనా భా తాగటానికి గుక్కెడు నీరు లేక అవస్థలు పడు తున్నారు. చెరువులు అడుగంటితే తాగునీటి వం తు ఎప్పటికీ ఇస్తారో తెలియని పరిస్థితి. ఎన్టీఆర్ జిల్లా గుడ్లవల్లేరు లాకుల నుంచి సుమారు 50 కిలోమీటర్ల మేర సీబీ కెనాల్ ద్వారా 702 క్యూసె క్కుల నీరు సరఫరా చేస్తేనే ఉప్పుటేరు తీర గ్రా మాల్లో తాగునీటి చెరువులను నింపడం సాధ్యమ వుతుంది. ప్రస్తుతం తాగునీటి వంతు జాప్యం జరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌ల్లో కొనుగోలు చేసి తాగుతున్నారు. ఆర్థిక స్థోమత లేని పేదలు అడు గంటిన చెరువుల్లో కలుషిత నీరు తాగి వ్యాధుల బారిన పడుతున్నారు.

పైపులైన్ ఏర్పాటు చేసేనే..

గత సెప్టెంబరు 21న కలిదిండి మండలం భాస్కరావుపేటలో కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి కలెక్టర్ వెట్రిసెల్వి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఉప్పుటేరు తీర గ్రామాల్లో శాశ్వత తాగు నీటి సమస్య పరిష్కారానికి చర్య లు తీసుకుంటామని, ప్రత్యామ్నాయ మార్గాలను చూపిస్తే జలజీవన్ మిషన్ ద్వారా నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే ఉప్పుటేరు తీర గ్రామాలకు సరిహద్దున ఉన్న పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలం ఏలూరు పాడు లాకుల నుంచి పైపులైన్ ఏర్పాటు చేస్తే శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కారమవు తుంది. జలజీవన్ మిషన్ పథకం ద్వారా పైపు లైన్ ఏర్పాటు చేసి ఉప్పుటేరు తీర గ్రామాల్లో తాగునీటి చెరువులను నింపుకోవచ్చు. ఏలూరు పాడులాకుల వద్ద గోదావరి జలాలు ఏడాది పొడ వున పుష్కలంగా ఉంటాయి. చెరువులు అడు గంటినప్పుడల్లా పైపులైన్ ద్వారా తోడుకోవచ్చు. ఈ వివరాలను తెలియజేస్తూ కొండంగి, మట్ట గుంట, పెదలంక సర్పంచ్‌లు తిరుమలశెట్టి జ్యో తి అంద్రాజు రత్నమణి, మోకా లక్ష్మి కలెక్టర్ వెట్రి సెల్వికి వినతిపత్రం అందించటానికి సన్నద్ధమవు తున్నారు. ఏలూరుపాడు లాకుల నుంచి పెదల ంక వరకు సుమారు 15 కిలోమీటర్ల మేర పైపు లైన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కామినేని శ్రీని వాస్, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లటానికి చర్యలు తీసుకుంటున్నారు.

పైపులైన్ ఏర్పాటు చేయాలి



ఏలూరుపాడు లాకుల నుంచి పెదలంక తాగునీటి చెరువు వరకు పైపులైన్ ఏర్పాటు చేస్తే తాగునీటి సమస్య పరిష్కార మవు తుంది. గతంలో పశ్చిమ గోదావరి జిల్లా కల్వపూడి నుంచి పెదలంక తాగునీటి చెరువు వరకు పైపులైన్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పరిష్క రించారు. ప్రస్తుతం ఆ పైపు లైన్ పాడపో యింది. దీంతో తాగునీటి సమస్య ఏర్పడింది.

\- మోకా లక్ష్మీ, సర్పంచ్,పెదలంక

సమస్య తీరుతుంది



ఏలూరుపాడు లాకుల నుంచి పెదలంక వరకు పైపు లైన్ ఏర్పాటు చేస్తే ఉప్పుటేరు తీర గ్రామాల్లో నివశిస్తున్న 20 వేల మం ది జనాభాకు వరమవు తుంది. ప్రస్తుతం తాగునీటి కోసం పలు అవ స్థలు పడుతున్నాం. కలుషిత నీరు తాగి ప్రజ లు రోగాల బారిన పడుతున్నా రు.పైపు లైన్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకో వాలి.

\- దుగ్గిరాల పరమేశ్వరరావు, జిల్లా తెలుగు రైతు ఉపాధ్యక్షుడు, పెదలంక

సమస్యలు పరిష్కరించాలని వినతి

మునునూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ ఆసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని జిల్లా అసోసియే ట్ అధ్యక్షులు తేజ, జనరల్ సెక్రటరీ జగదీష్ మంత్రి కొలుసు పార్థసారథిని కోరారు. గురువా రం యల్లాపురం వచ్చిన మంత్రిని ఇంజినీ రింగ్ ఆసిస్టెంట్లు, అసోసియేట్ నాయకులు కలిసి సమస్యలు వివరించారు. మంత్రి మా ట్లాడుతూ అధికారులు, ప్రభుత్వంతో మాట్లా డి ఖాళీ పోస్టులు భర్తీ చేయడం తోపాటు ప్రమోషన్ ఛానల్ కల్పించేలా కృషి చేస్తామ న్నారు. అసోసియేట్ అధ్యక్షులు రమేష్‌నాయ క్, నూజివీడు డివిజన్ ఇంజినీరింగ్ ఆసిస్టెం ట్లు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు సహకరించండి



డంపింగ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరు(ముదినేపల్లి), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కైకలూరును పరిసర ప్రాంతాలను స్వచ్ఛందంగా ఉంచేందుకు పరిశుభ్రతను కా పాడేందుకు అందరూ సహకరించాలని ఎమ్మె ల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ కోరారు. ఆయన ఏలూరు రోడ్డులో గతంలో ఏర్పాటు చేసిన చెత్త డంపింగ్ యార్డ్‌ను పరిశీలించి చెత్తను వేరే చోటకి పూర్తిస్థాయిలో తరలించాలని అధికారులను ఆదేశించారు.

ఈ పంట నమోదు చేసుకోవాలి

నూజివీడు టౌన్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి): రైతులు విధిగా ఈ పంట నమోదు చేసుకో వాలని ఏడీఏ జి.విద్యాసాగర్ అన్నారు. సోషల్ ఆడిట్ నమోదు విషయంపై ఈ.పంట నమో దు జాబితాను గొల్లపల్లి గ్రామ సచివాలయం లో ప్రదర్శించారు. ఆయన రైతులతో ముఖా ముఖి మాట్లాడారు. ఈ పంట నమోదు జాబి తాపై రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఏవో ఆలూరి చాముండేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

లక్ష్యాలతో ఒత్తిడి

నూజివీడు టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తపాలా ఉద్యోగులకు టార్గెట్స్ ఇస్తూ ఉద్యోగు లపై వేదింపులను ఆపాలని ఎన్ఎఫ్‌పీఈ ఆ ధ్వర్యంలో తపాలా శాఖ ఉద్యోగులు నూజివీ డు పోస్టాఫీసు గురువారం వద్ద నిరసన తెలిపారు. ఆచరణ సాధ్యం కాని టార్గెట్‌లను వెంటనే ఆపాలని సక్రమమైన రీతిలో డాక్ కర్మయోగి శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలని 8వ వేతన సవరణ కమిటీ వెంటనే నియమి ంచాలని డిమాండ్ చేశారు. నూజివీడు సబ్ డివిజన్ ఏఐజీపీఎస్‌యూ సెక్రటరీ పి.నాగేశ్వ రరావు, అధ్యక్షుడు హాజరయ్య, కోశాధికారి సారథి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఆపన్నహస్తం

ఆగిరిపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పుట్టుకతో గానీ, ప్రమాదంలో గానీ శరీర అవ యువాలు కోల్పోయిన దివ్యాంగులకు దాతలు ఆర్థిక సహాయం ద్వారా కొత్త జీవితం ప్రసాది ంచటం అభినందనీయమని హీల్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కేపీఎస్ ప్రసాద్ అన్నారు. తోటపల్లిలోని హీల్ కృత్రిమ అవ యువ కేంద్రంలో కె.శంకరరావు, వి.తాతారావు, రాజ్యలక్ష్మి, డి.రాధిక ఆర్థిక సాయంతో ఐదు గురికి కృత్రిమ కాళ్లను గురువారం అందజే శారు. హీల్ సీఈవో కె.అజయ్‌కుమార్, ఆక్స్‌ఫ ర్డ్ యూనివర్శిటీ నుంచి వచ్చిన హీల్ యూకె ప్రతినిధి, జూలీ, 20 మంది ప్రతినిధులు, పిన్న మనేని సిద్ధార్థ మెడికల్ అండ్ సైన్‌సెస్ కాలే జీ పూర్వపు ప్రిన్సిపాల్ డాక్టర్ సి. మాదవరావు పాల్గొన్నారు.

భూసార పరీక్ష కార్డుల పంపిణీ

ముదినేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కోడూరులో గురువారం ఏవో వేణుమాదవ్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు భూసార పరీక్షల ఫలి తాల కార్డులను అందజేశారు. మండల పశు వైద్యాధికారి డాక్టర్ క్రాంతి కుమార్, ఎఫ్‌డీవో సతీష్, ప్రకృతి వ్యవసాయ విభాగం ఇంచార్జ్ గీతం కుమార్ పాల్గొన్నారు.

ఉచిత ఇసుక అందించడమే లక్ష్యం



ఇసుక రీచ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పార్థసారథి

మునునూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక పాలసీకి ప్రభుత్వం కట్టుబడి ఉం దని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. వల సపల్లి, యల్లాపురంల్లో గురువారం ఉచిత ఇసుక రీచ్‌లను ఆయన ప్రారంభించారు. ఇప్పుడున్న రీచ్‌లతోపాటు మరో 108 రీచ్‌లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. దూరాన్ని బట్టి ధర వసూలు చేయాలని, ఇష్టారాజ్యంగా వసూలు చేసేందుకు విలులేదని ఆయన స్పష్టం చేశారు. దీనిపై ట్రాక్టర్ల యాజమాను సమావేశమై ధరల వివరాలను ఆర్డీవోకు అందజేయాలన్నారు. నూజివీడు ఆర్డీవో వాణి, సర్పంచ్‌లు చలసాని దామోదరరావు, మొక్కపాటి మురళీ కృష్ణ, ఎంపీ డీవో జి.రాణి, ఇన్‌చార్జి తహసీల్దార్ పురు షోత్త మశర్మ, టీడీపీ మండల అధ్యక్షులు దేవినేని ధలరాం, గ్రామ అధ్యక్షులు మేదరమెట్ల సురేం ద్ర, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పశుగణనకు సహకరించండి

దేశ వ్యాప్తంగా 21వ పశుగణన అక్టోబర్ 25 నుంచి 2025, ఫిబ్రవరి 28 వరకు జరుగు తుందని, మంత్రి కొలుసు పార్థసారథి తెలిపా రు. పశుగణనకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, బ్రోచర్లు, స్టిక్కర్లు, సూచన పుస్తకాలను మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. 16 రకా ల పెంపుడు జంతువులపై పశుగణన పూర్తి అయితే ఇంటి ముందు తలుపునకు కుడి ఎగువ మూలలో స్టిక్కర్ అంటిస్తారన్నారు సన్న, చిన్న కారు రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ఆర్థిక రుణాలను అందిపుచ్చుకొని సబ్సిడీ రుణా లపై అవగాహన ఉండాలన్నారు. బ్యాంకర్స్, అగ్రికల్చర్, ఇతర ప్రభుత్వ అధికారులు ప్రతినెల ఒక సమావేశం ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

జీవాల పెంపకదారుల అభివృద్ధికి తోడ్పాటు



సూరేపల్లిలో జీవాలకు నట్టల మందును వేస్తున్న టీడీపీ నాయకుడు మల్లిబాబు

మునునూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ గ్రామ అధ్యక్షులు సళ్ళగుళ్ళ మల్లిబాబు అన్నారు. గురువారం సూరేపల్లిలో జీవాలకు నట్టల నివారణ మందును వేసి పంపిణీని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా 1478 గొర్రెలు, 150 మేకలకు పశువైద్యసిబ్బంది ఆధ్వర్యంలో ఉచితంగా నట్టల మందును రైతులకు పంపిణీ చేశారు. జీవాల పెంపకం దారులకు ప్రభుత్వ అందిస్తున్న సబ్సిడీ పథకాలు, ఉచిత మందులు, ఇతర సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని మల్లిబాబు కోరారు. ఈ కార్యాక్రమంలో వార్డు సభ్యులు కొల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలు ప్రారంభం



కైకలూరు(ముదినేపల్లి), అక్టోబరు 24(ఆం ధ్ర జ్యోతి): కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాల ల విద్యార్థుల తైక్వాండో ఆటల పోటీలను గురు వారం కైకలూరులోని ప్రభుత్వ వైవీఎన్నార్ డిగ్రీ కళాశాలలో వైస్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఉదయ ప్రకాశరావు ప్రారంభించారు. వివిధ కళాశాలల కు చెందిన 60 మంది పాల్గొన్నారు. విజేతలైన క్రీడాకారులు వచ్చే నెల ఆరు నుంచి అమృతసర్ లో జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొంటారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ శివనాగరాజు తెలిపారు.

బెనర్జికి పురస్కారం



బెనర్జీని సత్కరిస్తున్న నిర్వాహకులు

కైకలూరు (ముదినేపల్లి), అక్టోబరు 24(ఆం ధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లి గూడెంలో ప్రపంచ తెలుగు సాహితి కళాజా తర పేరుతో స్థానిక శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యం లో జరిగిన శతాధిక కవి సమ్మేళనంలో కైకలూ రుకు చెందిన ఉపాధ్యాయుడు సహజ కవి దండే బెనర్జీకి శ్రీశ్రీ కళావేదిక అత్యుత్తమ పుర స్కారం లభించింది. ఆయన 'వీడే మనిషి- వీడేం మనిషి' అనే కవితకు ఈ పురస్కారం లభించింది.

చెరువు లీజుకు మాకు సంబంధం లేదు

కైకలూరు(ముదినేపల్లి), అక్టోబరు 24(ఆం ధ్రజ్యోతి): కైకలూరులోని కరకట్ట సమీపం లోని 118 ఎకరాల చెరువు లీజు వ్యవహారంతో ఎన్డీఏ నాయకులకు ఎటువంటి సంబంధం లేదని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు స్ప ష్టం చేశారు. ఆ చెరువును లీజుకు తీసుకున్న వైసీపీ మాజీ ఎమ్మెల్యే కుటుంబీకులకు, చెరు వు లీజుదారులకు మధ్య ఏర్పడిన వివాదాన్ని సామరస్య పూరకంగా పరిష్కరించుకోవాలని ఆయన గురువారం సాయంత్రం కైకలూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. బుధవారం సాయంత్రం ఆ చెరువులో జరిగిన పట్టుబడుల వెనుక ఎన్డీఏ నాయకుల ప్రమేయం లేదని స్పష్టం చేశారు.

మృత దేహం లభ్యం



కైకలూరు (ముది నేపల్లి), అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి దోనె తిరగబడి కొల్లేరులో బుధవారం గల్లం తైన పందిరిపల్లిగూడెంకు చెందిన ఘంటసాల అంతర్వేది (38) మృతదేహం గురువారం లభ్య మైంది. దోనె తిరగబడిన ప్రదేశంలోనే మృత దేహాన్ని గుర్తించారు. దీంతో అంతర్వేది కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. సర్పంచ్ సముద్రుడు, టీడీపీ నాయకుడు బలే ఏసురాజు పోలీసులకు సమాచారం అందించగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని కైకలూరు ప్రభుత్వా స్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

మామను కరచిన అల్లుడు

ముదినేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మావపై అల్లుడు దాడి చేసి శరీరంపై పలు చోట్ల కొరికి తీవ్రంగా గాయపరిచాడు. పోలీసులు తెలిపిన వివరాలివి.. దేవపూడికి చెందిన మట్ల పూడి కనకారావు కుమార్తె స్టాలిన్ దేవితో పది హేనేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన అబ్బిశెట్టి బాలాజీతో వివాహమైంది. నాలుగేళ్ల కిందట భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తి పోలీస్ స్టేషన్‌లో కేసులు పెట్టుకోగా వివాదం కోర్టుకు చేరగా వాయిదాలు జరుగుతున్నాయి. భార్యా భర్తలు వేర్వేరుగానే ఉంటున్నారు. ఈ నేపథ్య ంలో ఈ నెల 20న స్టాలిన్ దేవి తండ్రి కనకా రావుతో అల్లుడు బాలాజీ తగాదా పడి 'నువ్వు బతికున్నంత కాలం నా భార్య నా దగ్గరకు రా దు, నిన్ను చంపేస్తా' అంటూ మావపై దాడికి దిగి ఎడమ చేతి వేళ్లను, కంటి నొసలను కొరికే శాడు. దీంతో కనకారావును గుడివాడ ప్రభుత్వా స్పత్రిలో చేర్పించారు. గురువారం ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి పశు గణన

నూజివీడు టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పశుగణన ఈ నెల 25 నుంచి నిర్వహించ ను న్నట్లు నూజివీడు పశు సంవర్థకశాఖ డీడీ చం ద్రశేఖర్‌రావు తెలిపారు. డివిజన్ పరిధి లోని 10 మండలాల్లో 150 ఎన్యూమరేటర్లు, 19 మ ంది సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చామని ఆన్‌లై న్‌లో పశుగణన చేస్తామన్నారు. పక్షి జాతులైన కోళ్ళ, పెంపుడు జాతులను లెక్కిస్తామన్నారు.

ఆలయ భూముల వేలం

కలిదిండి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పెదలంక నాగేశ్వరస్వామి ఆలయానికి చెం దిన 21.25 ఎకరాల చేపల చెరువుల భూము లకు వేలం నిర్వహించగా, ఏడాదికి రూ.15 లక్షల 93 వేల 750 పలికిందని ఈవో వీఎస్‌కే శేఖర్ తెలిపారు. ఎకరానికి రూ.75 వేలు చొప్పు న మూడేళ్ల కాలపరిమితి ఉంటుందన్నారు.

యూటీఎఫ్ అధ్యక్షుడిగా కృష్ణారావు

చాట్రాయి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ చాట్రాయి మండల నూతన కార్య వర్గ ఎన్నిక సి.గుడిపాడు జడ్పీ పాఠశాలలో గురువారం నిర్వహించగా అధ్యక్షుడిగా కె.కృష్ణా రావు, ప్రధాన కార్యదర్శిగా సిహెచ్.రఘు ఎన్ని కయ్యారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కా రానికి కృషి చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డి.అనురాధ కోరారు.

నాయీబ్రాహ్మణుల హర్షం

చాట్రాయి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆలయ కమిటీల్లో నాయీబ్రాహ్మణులకు అవ కాశం కల్పిస్తూ సీఎం, డిప్యూటీ సీఎం తీర్మా నం ఆమోదించటం పై ఏలూరు జిల్లా సాధి కార కమిటీ అధ్యక్షులు నాయీబ్రాహ్మణ సం ఘ నాయకులు కొప్పెర్ల నాగరాజు రాయవ రపు సీతారాములు, టీడీపీ నాయకులు రాయ వరపు పుల్లారావు హర్షం వ్యక్తం చేశారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

ఆగిరిపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గొల్లగూడెం సమీపంలో గల పామాయిల్ తోట లో కోడిపందేలు ఆడుతూ పది మంది గ్రామ స్తులు పట్టుబడ్డారు. సుమారు రూ.3 వేలు నగదు, 11 బైకులు స్వాధీనం చేసుకుంటున్న ట్లు సిబ్బందితో కలిపి దాడిచేసిన ఎస్సై శుభ శేఖర్ తెలిపారు.

పెండింగ్ జీతాలు ఇవ్వాలి

నూజివీడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న శానిటరీ, సెక్యూరిటీ సిబ్బందికి పెండింగ్ జీతాలను తక్ష ణం విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ మెడిక ల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ప్రకాష్ డిమాండ్ చేశారు. నూజివీడు ఏరియాఆస్పత్రి వద్ద శానిటేషన్, సెక్యూరిటీ కార్మికులతో గురువారం ధర్నా నిర్వ హించారు. పెండింగ్ జీతాలను విడుదల చే సి, పీఎఫ్, ఈఎస్ఐ కాంట్రాక్టర్ జమ చేయా లని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నియో జకవర్గ కార్యదర్శి చాట్ల పుల్లారావు, కార్మికులు శివ, వెంకటేశ్వరరావు, పద్మ పాల్గొన్నారు.

తప్పులను సవరించేందుకే..

చాట్రాయి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేలలో జరిగిన తప్పుఒప్పులను సవరించే విధంగా చిత్తపూరులో గురువారం గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ ప్రశాంతి, గ్రామం లో క్షేత్రపరిశీలన చేసి రీ సర్వే లోపాలను పరిష్కరిస్తామన్నారు. మాజీ సర్పంచ్ దామెర చిట్టిబాబు, డీటీ గీత, సర్వేయర్ లక్ష్మీనారా యణ, రామదాసు, రైతులు పాల్గొన్నారు.

కొచ్చెర్లలో 75 అర్జీలు

- కలిదిండి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కొచ్చెర్లలో రెవెన్యూ గ్రామసభకు 75 మంది రైతులు అర్జీలు అందజేశారని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. సర్పంచ్ ఆలరాము, ఆర్ఐ శ్యామల, సర్వేయర్ మహ్మద్ షమీ, వీఆర్వో గంగాధర్ పాల్గొన్నారు.
- నూజివీడు టౌన్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 24: మర్సపూడిలో నిర్వహించిన గ్రామసభలో భూ సరిహద్దుల్లో తేడాలు, విస్తీర్ణంలో పలు అభ్యం తరాలపై రైతులు 41 అర్జీలను దాఖలు చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ సింగ్ తెలిపారు.
- మునునూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గోపవరంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురు షోత్తమశర్మ రైతుల నుంచి 125 అర్జీలను స్వీకరించారు.